
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
ఆదివారం 26 అక్టోబరు 2025





ముంచుకొస్తోన్న.. మొంథా

- ఐఎండీ హెచ్చరికలు జారీ
- తీవ్ర ప్రభావం చూపే అవకాశం
- తుపాను ప్రకటనతో రైతుల ఆందోళన
- అధికారుల అప్రమత్తం.. ముందస్తు చర్యలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుపానుగా మారి మొంథా పేరుతో మొంచుకొస్తోంది. తుపాను ప్రభావంతో గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అతి భారీగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. పల్నాడు జిల్లాపైనా ప్రభావం ఉండవచ్చని అధికారులు అప్రమత్తమయ్యారు. తుపాను ప్రభావంతో జిల్లాలో 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నట్లుగా అధికారులు చెబుతున్నారు. పంట చేతికొచ్చే తరుణంలో తుపానుతో నిండా మునిగిపోతామని రైతులు ఆవేదన చెందుతున్నారు. వరి, పత్తి వంటి పంటలు కోత దశకు వచ్చిన నేపథ్యంలో నాలుగు రోజులు వర్షాలపై వాతావరణశాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కురిసిన వర్షాలతో నష్టపోయామని.. ముంచుకొస్తోన్న మొంథా ముంచేస్తుందని వాపోతున్నారు. పంట ఏ దశలో ఉన్నప్పటికీ తుపాను వలన అధిక వర్షపాతం నమోదైతే చేతి కొచ్చే దిగుబడులు నీటిపాలవుతాయని రైతులు ఆవేదన చెందు తున్నారు. భారీ వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. తపాను ప్రభావంతో 27 నుంచి 29 వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు (మిగతా 7వ పేజీలో)



కారంచేడు మండలం తిమిడిత పాడు వద్ద నీట మునిగిన పంట పొలాలు



హార్బర్‌లో 1వ నెంబరు హెచ్చరిక

రేపల్లె: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా బలపడుతున్న నేపథ్యంలో నిజాంపట్నం హార్బర్‌లో 1వ నెంబర్ ప్రమాదహెచ్చరికను ఎగురవేసినట్లు పోర్టు అధికారులు తెలిపారు. సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంది. ఈదురుగాలులు కూడా వీస్తున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో వేట చేసే పరిస్థితి లేక మత్స్యకారుల బోట్లు జెట్టీలకే పరిమితమయ్యాయి.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్, జేసీ భావనవశిష్ఠ

రేపటి నుంచి 29 వరకు పాఠశాలలకు సెలవు

- తుపాను విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు
- అప్రమత్తంగా ఉండాలన్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో భారీవర్షం, గాలులు వీచే అవకాశం ఉన్నందున 27 నుంచి 29 వరకు పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్‌లో ఎస్పీ ఉమామహేశ్వర్, అన్నిశాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనాలు సరిగ్గా లేని ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులను ఇళ్లకు పంపాలని ఆదేశించారు. తుపాను విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేపల్లె, నిజాంపట్నం, బాపట్ల, చినగంజాం, వేటపాలెం, కర్లపాలెంలో భారీవర్షాలు పడే అవకాశం ఉందన్నారు. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల, గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో అధికారులు యూనిట్లుగా ఏర్పడి ఎలాంటి నష్టం జరగకుండా ఏర్పాట్లు చేసుకోవా లన్నారు. 27 నుంచి 29 వరకు అధికారులంతా సమన్వయంతో పనిచేసి తుఫాన్ను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఉద్యోగులు సెలవులు రద్దు చేసుకుని విధుల్లో చేరాలన్నారు. జిల్లాలోని అధికారులు, ఉద్యోగులందరూ 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. 122 రెవెన్యూ గ్రామాల్లోని పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో జేసీ భావనవశిష్ఠ, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

బీచ్‌లు బంద్ : ఎస్పీ ఉమామహేశ్వర్

తుపాను హెచ్చరికల నేపథ్యంలో సోమవారం నుంచి 29 వరకు మూడురోజులు జిల్లాలోని బీచ్‌లను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. పర్యాటకులు, సముద్ర స్నానాలకు ఆచరించే భక్తులు తీరాలకు రావద్దని, ఎవరైనా వస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుశాఖ తీసుకుంటున్న ముందస్తు చర్యలకు ప్రజలు సహకరించాలన్నారు. ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు, నాలుగు క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు బాపట్లలో అందుబాటులో ఉన్నాయన్నారు. పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలిస్తే పోలీసు బందోబస్తు ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.

యూరియా బస్తా రూ.450

- అధిక వర్షాలకు పొలాల్లో నిలిచిన నీరు
- పంటల సంరక్షణకు యూరియా వినియోగం
- ఒక్కసారిగా పెరిగిన డిమాండ్..
- సరఫరాలో జాప్యం.. అన్నదాతలకు శాపం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అధిక వర్షాలతో పంటలు ఉరకెత్తుతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు యూరియాను వినియోగిస్తున్నారు. రైతులందరూ పంటలకు ఒకే సమయంలో యూరియా వాడాల్సిన పరిస్థితులు ఏర్పడటంతో డిమాండ్ పెరిగింది. దీనిని కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో యూరియా బస్తా రూ.420 నుంచి రూ.450 వరకు విక్రయిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. జిల్లాలో యూరియా కొరత లేదని వ్యవసాయ అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పెరిగిన డిమాండ్ కారణంగా సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రైవేట్ షాపులపై పర్యవేక్షణ కొరవడడంతోనే అధిక ధరకు యూరియా విక్రయిస్తున్నారన్న విమర్శలు వస్తున్నా యి. ఎరువుల సరఫరాలో జరగు తున్న జాప్యం రైతులకు శాపంగా పరిణమిస్తోంది.

ఆర్‌ఎస్కేలకు నిలిచిన సరఫరా

అల్పపీడన ప్రభావంతో జిల్లా అంతటా (మిగతా 7వ పేజీలో)



గంజాయిని పరిశీలిస్తున్న ఎస్‌బీ సీఐ రాంబాబు, ఎస్ఐలు రవి, సరస్వతీ, ఎస్ఎమ్‌కే రెడ్డి

పూరీ-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీ

- ప్రయాణికుడి బ్యాగులోని 21 కేజీల గంజాయి స్వాధీనం

బాపట్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బాపట్ల రైల్వేస్టేషన్‌లో పూరీ-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో ఈగల్‌టీమ్ శనివారం తనిఖీలు చేపట్టింది. ఓ వ్యక్తి బ్యాగ్‌లో 21 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రయాణికుడ్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ రాంబాబు, ఎస్ఐలు రవి, రాజ్యలక్ష్మి, సరస్వతి, ఎస్ఎమ్‌కే రెడ్డి, కొండయ్యలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సంఘాలకు.. జీఎస్టీ బాదుడు

వైసీపీ పాలనలో ఐదేళ్లు పాడుబెట్టిన సాగర్ కాలువలను కూటమి ప్రభుత్వం బాగు చేసింది. పూర్తి స్థాయిలో పనులు జరగడంతో చివరి భూములకు సైతం సాగునీరు సరఫరా జరుగుతోంది. నీటి సంఘాల ఆధ్వర్యంలో కాలువుల మరమ్మతులు నిర్వహించారు. ఈ పనులకు జీఎస్టీ విధించారు. కాంట్రాక్టర్లు చేపట్టే పనులకు ఉన్న జీఎస్టీ విధానాన్ని నీటి సంఘాలకూ అమలు చేశారు. దీంతో చేపట్టిన మర్మమతుల పనులకు రూ.4.49 కోట్లు జీఎస్టీ చెల్లించాల్సి వస్తోంది. దీంతో నీటి సంఘాలు గుడ్లు తేలేస్తున్నాయి. 12 శాతం జీఎస్టీని అమలు చేశారని.. దీనిని రద్దు చేయాలని నీటి సంఘాలు కోరుతున్నాయి. చేసిన పనులకు నేటి వరకు బిల్లులు చెల్లించలేదని సంఘాల ప్రతినిధులు వాపోతున్నారు.

- కాల్వల మరమ్మతులకు 12 శాతం జీఎస్టీ
- బిల్లుల చెల్లింపులోనూ జాప్యం
- రూ.37.44 కోట్ల వ్యయంతో 801 పనులు
- జీఎస్టీ వసూలు రూ.4.49 కోట్లు



మైనర్ కాలువలో పూడికతీత (పాతచిత్రం)

బిల్లుల్లో జాప్యం.. జీఎస్టీ శాపం

నీటి సంఘాలు నిర్వహించిన మరమ్మతుల పనులకు జలవనరుల శాఖ అధికారులు బిల్లులు సిద్ధం చేశారు. అయితే బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందని నీటి సంఘాలు చెబుతున్నాయి. మరమ్మతుల వ్యయం అంచనా ల్లోనే 12 శాతం జీఎస్టీ చెల్లించే విధంగా పొందు పరిచారు. ఈ విషయం తెలియక నీటి సంఘాలు పనులు పూర్తి చేశాయి. అంచనా వ్యయం మేరకు పూర్తిగా బిల్లులు చెల్లిస్తారని అవి భావించాయి.

(పర్చూరు, ఆంధ్రజ్యోతి)

సాగర్ కుడి కాలువ పరిధిలో అధ్వా నంగా ఉన్న మేజర్, మైనర్, సబ్ మైనర్ కాలువల మరమ్మతులకు ప్రభుత్వం రూ.37.44 కోట్లు నిధులు విడుదల చేసిం ది. జలవనరుల శాఖ గుర్తించిన 801 అత్య వసర పనులను చేపట్టిన నీటి సంఘాలు పనులను పూర్తి చేశాయి. కాలువల్లో పూడిక తీత, కంప చెట్ల తొలగింపు, కట్టల పటిష్ఠత, కట్టడాల పునరుద్ధరణ వంటి పనులు చేశారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధి లోని నాగార్జున సాగర్ లింగంగుంట్ల, ఒంగోలు సర్కిల్ పరిధిలో 801 అత్యవసర మరమ్మతులు పూర్తి చేశారు. ప్రతి నియోజకవర్గం పరిధిలో దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో కాలువల మరమ్మతులు జరిగాయి.

ప్రభుత్వం పునరాలోచన చేయాలి

ఏళ్ల తరబడి కాలువలకు మరమ్మతులు చేయపోవడంతో.. కొన్ని నీటి సంఘాల పరిధిలో రైతులను భాగస్వాములను చేసి వ్యయం అంచనాకు మించి పనులు చేశారు. తీరా బిల్లుల్లో జీఎస్టీ చూపించడంతో తాము తీవ్రంతా నష్టపోతామని (మిగతా 7వ పేజీలో)

కడసారి చూసుకోలేక

- విషాదంలో ధాత్రి కుటుంబ సభ్యులు
- డీఎన్ఏ పరీక్ష అనంతరమే శరీర భాగాల అప్పగింత



ధాత్రి తల్లి వాణి

ఇంకొల్లు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఒక్కగానొక్క సంతానం. ఐదేళ్ల క్రితం భర్త మృతి చెందగా రెక్కల కష్టంతో కుమార్తెను ఉన్నత చదువులు చదివించింది. మంచి ఉద్యోగంలో స్థిరపడాలని.. వివాహం చేయాలని కలలు కన్నది. అయితే ఆమె ఆశలన్నీ కర్నూలు సమీపంలో ట్రావెల్ బస్సులో బుగ్గిపాలయ్యాయి. కర్నూలులో బస్సు దగ్ధమైన ఘటనలో ఇంకొల్లు మండలం పూసపాడు గ్రామానికి చెందిన గన్నమనేని ధాత్రి సజీవదహనమై ప్రాణాలు కోల్పోయింది. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న ధాత్రి దీపావళి పండుగకు హైదరాబాద్‌లో మేనమామ ఇంటికి వెళ్లి తిరిగి బెంగళూరు వెళుతుండగా బస్సు ప్రమాదంలో మృతి చెందింది. కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే పూర్తిగా కాలిపోయిన దేహాన్ని గుర్తుపట్టలేకపోయారు. కనీసం కడసారి చూపునకు సైతం నోచుకోలేదని తల్లితో పాటు బంధువులు కన్నీటి పర్యంతమవుతున్నారు. డీఎన్ఏ పరీక్ష అనంతరం శరీర భాగాలను ఇస్తామని అధికారులు చెప్పడంతో శనివారం తల్లి వాణి, కుటుంబసభ్యులు శనివారం స్వగ్రామం పూసపాడు చేరుకున్నారు. మనోవేదనతో గ్రామానికి చేరుకున్న ధాత్రి తల్లి వాణిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. పూసపాడులో విషాదఛాయలు అలుముకున్నాయి. సోమ, మంగళవారాల్లో ధాత్రి శరీరభాగాలను అప్పగించే అవకాశం ఉందని కుటుంబసభ్యులు తెలిపారు.

బర్లీ పొగాకు కొనుగోలుకు చర్యలు

- ఎమ్మెల్యే ఏలూరితో గ్రేడింగ్ పరిశీలించిన కలెక్టర్

పర్చూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద ఇంకా మిగిలి ఉన్న బర్లీ పొగాకును కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలిసి కలెక్టర్ శనివారం మండలంలోని ఉప్పుటూరులో పొగాకు మండెలను పరిశీలించారు. రైతుల వద్ద పొగాకును నిబంధనలు లేకుండా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే ఏలూరి కోరారు. నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో పొగాకు దెబ్బతినే పరిస్థితి ఉందని, తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. గతంలో అమ్ముకుని నగదు అందని రైతులకు త్వరితగతిన చెల్లింపులు చేయాలన్నారు. పొగాకు రైతుల సమస్యను దృష్టిలో పెట్టుకుని చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా ఉన్న నిల్వలు, గొడౌన్ల పరిస్థితులను మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొమర్నేనివారిపాలెంలో కూలీలతో గ్రేడ్ చేస్తున్న పొగాకును పరిశీలించారు.



పొగాకు గ్రేడ్‌ను ఎమ్మెల్యేతో కలసి పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

అదనపు గదులకు శంకుస్థాపన

పర్చూరు మండలం ఉప్పుటూరులో రూ.530.60 లక్షలతో గిరిజన గురుకుల పాఠశాల(బాలుర)లో అదనపు తరగతి గదులకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలసి కలెక్టర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలన్న సంకల్పంతో ప్రభుత్వం అదనపు తరగతి గదుల నిర్మాణం చేపడుతుందన్నారు. నాణ్యతా ప్రమాణాలతో పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పనులను పూర్తిచేసి వచ్చే విద్యా సంవత్సరం కల్లా తరగతి గదులను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెద్దపూడి విజయ్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ లవన్న, ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్లు షేక్.షంషుద్దీన్, హుస్సేన్, డీసీ చైర్మన్ పొద వీరయ్య, డీఈ సృజన తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర పుటల్లోకి ఫిల్మ్ చాంబర్?

30 ఏళ్ల భవనాల కూల్చివేతకు రంగం సిద్ధం.. భారీ వాణిజ్య భవనం నిర్మాణానికి కసరత్తు

- లీజు ముగియకుండానే ఖాళీ ప్రయత్నం
- ఎలాగైనా అడ్డుకుంటామన్న మెజార్టీ సభ్యులు
- మొత్తం భవనం ఇండస్ట్రీకే వాడాలి: సురేశ్‌బాబు

(సినిమా డెస్క్)

గత మూడు దశాబ్దాలుగా జూబ్లీహిల్స్‌లోని ఫిల్మ్ చాంబర్ భవనం తెలుగు సినీ పరిశ్రమకు ఒక చిరునామాగా మారింది. అక్కడే నిర్మాతల మండలి, నిర్మాతల కోసం నిర్మించిన గదులు, రిక్రియేషన్ క్లబ్ మొదలైనవన్నీ ఉన్నాయి. ఈ ప్రాంతంలో కొందామంటే గజం భూమి దొరకదు. అలాంటిది ఎకరంపైనే విస్తీర్ణంలో ఉన్న ఫిల్మ్ చాంబర్ భవనాలపై కొందరి కన్ను పడింది. అక్కడున్న నిర్మాణాలన్నీ కూల్చేసి, బహుళ అంతస్తుల భవనం కట్టాలని వారు సంకల్పించారు. అయితే, తెలుగు సినీ పరిశ్రమకు వారసత్వంగా వస్తున్న చాంబర్ భవనాలను కూల్చొద్దని మెజారిటీ సభ్యులు కోరుకుంటున్నారు. వీరి విన్నపాలు వినకుండా ఫిల్మ్‌నగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ... ఫిల్మ్ చాంబర్ పాలక మండలిలో తమకు అనుకూలంగా ఉన్న కొందరితో కలిసి ఏకపక్షంగా భవనాలను కూల్చేందుకు రంగం సిద్ధం చేసింది. చాంబర్ పాలకమండలి గడువు ముగిసినా ఎన్నికలు జరపకుండా ఎప్పటికప్పుడు వాయిదా వేయడానికి కారణం కూడా కొత్త పాలకమండలి వస్తే బహుళ అంతస్తుల భవనం ప్రతిపాదనకు ఎక్కడ అడ్డం పడుతుందోనన్న భయంతోనే అని సభ్యులు ఆరోపిస్తున్నారు.

తొలి అడుగులు

మూడు దశాబ్దాల క్రితం తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాద్‌కు తరలి వస్తున్న సమయంలో సినీ పరిశ్రమలో పని చేసే వారికి ఇళ్ల స్థలాల అవసరాల కోసం ఫిల్మ్‌నగర్ సహకార హౌసింగ్ సొసైటీ ఏర్పడింది. అదే సమయంలో నిర్మాతలు, దర్శకులు, డిస్ట్రిబ్యూటర్స్ ఎగ్జిబిటర్ల వాణిజ్య అవసరాల కోసం భవంతులు అవసరమయ్యాయి. జి.హనుమంతరావు. రమేష్ ప్రసాద్, రామానాయుడు, వి.బి.రాజేంద్రప్రసాద్, డి.వి.ఎస్ రాజు, ఎం.ఎస్.రెడ్డి, సత్యచిత్ర సూర్యనారాయణ మొదలైన సినీ ప్రముఖులు ఉమ్మడిగా చేసిన విజ్ఞప్తి మేరకు హౌసింగ్ సొసైటీ రిక్రియేషన్ కోసం ఉద్దేశించిన భూమిలో కొంత చాంబర్‌కు లీజుకు ఇచ్చింది. ఇందులోనే చాంబర్ కొన్ని భవనాలు నిర్మించింది. నిర్మాణానికి సినీ ప్రముఖులు కూడా కొంత విరాళం ఇచ్చారు. అప్పట్లోనే 1.16 కోట్ల రూపాయల ఖర్చు అయిందని అంచనా. తర్వాత నాలుగేళ్లకు నిర్మాతల మండలికి, మరో 8 మంది నిర్మాతలకు హౌసింగ్ సొసైటీ మరికొంత భూమి ఇచ్చి లీజు ఒప్పందాలు కుదుర్చుకుంది. ప్రముఖ నిర్మాత వి.బి.రాజేంద్రప్రసాద్ కొండ మీద ఉన్న స్థలంలో దేవాలయాన్ని కూడా నిర్మించారు. ఇలా ఈ స్థలమంతా సినిమా ఇండస్ట్రీకి కేంద్ర బిందువుగా మారింది.

లీజు పూర్తయిందని..

ఈ భూమిని 30 సంవత్సరాలకు లీజుకు ఇచ్చారు. ఇది వచ్చే ఏడాది ముగుస్తుంది. నిర్మాతల మండలికి, నిర్మాతలకు ఇచ్చిన లీజులు మాత్రం 2030 దాకా ఉన్నాయి. ఇక్కడ భూముల ధరలు ఆకాశానికి అంటిన నేపథ్యంలో హౌసింగ్ సొసైటీ మొత్తం భూమిని స్వాధీనం చేసుకొని బహుళ అంతస్తుల భవనాన్ని కట్టాలనే ప్రతిపాదన తెచ్చింది. స్థలంలో చాంబర్, నిర్మాతల మండలి కార్యాలయాలు ఉన్నందున వారి అంగీకారం కోసం ఏడాదిగా చాంబర్‌లో, నిర్మాతల మండలిలలో చర్చలు జరుగుతున్నాయి. అయితే, దీనిపై సభ్యుల్లో భిన్నాభిప్రాయాలు నెలకొన్నాయి. తెలుగు సినీ పరిశ్రమకు ల్యాండ్‌మార్క్‌గా ఉన్న భవనాలను తీసేయడాన్ని మెజారిటీ సభ్యులువ్యతిరేకించటం మొదలపెట్టారు. చర్చలు కొనసాగుతుండగానే చాంబర్ పాలక వర్గంలో కొందరు హౌజింగ్ సొసైటీతో చేతులు కలిపి కూల్చివేతకు అనుకూలంగా పావులు కదిపారని వార్తలు గుప్పుమన్నాయి. చాంబర్ అద్దెకు ఇచ్చిన షాపులను, బ్యాంకును ఖాళీ చేయించడం అనుమానాలను బలపరిచింది. ఏం జరుగుతుందో తెలుసుకొనే ప్రయత్నం సభ్యులు చేస్తుంటే చాంబర్ పాలక మండలి నుంచి ఎటువంటి స్పందనా రాలేదు. '30 ఏళ్ల కిందట తరలివచ్చిన సినిమా పరిశ్రమకు ఈ భవనం సంకేతం. దీన్ని కూల్చటానికి మేము ఒప్పుకోం. అవసరమైతే కోర్టుకు వెళ్తాం" అని చాంబర్ సభ్యుడొకరు చెప్పారు.



ఆఫర్‌లు ఇస్తున్నారు

నాకు 800 చదరపు అడుగుల ఆఫీసు ఉంది. రెండేళ్ల క్రితం దీనిని 20 లక్షలు వెచ్చించి పునఃనిర్మించుకున్నాను. సొసైటీ కమిటీలో ఒక సభ్యుడు వచ్చి, మీరు ఎందుకు అభివృద్ధిని ఆపుతున్నారు? మీకేం కావాలో చెప్పండి సెటిల్ చేస్తాం అన్నారు. నాలాగే ఇతరులకు కూడా ఇలాంటి ఆఫర్స్ ఇచ్చారు. కొందరు తీసుకున్నారని విన్నాను. సినీ ప్రముఖులందరూ విరాళాలు సేకరించి కట్టుకున్న భవంతులివి. నిర్మించి 30 ఏళ్లే అయ్యింది. ఎందుకు కూల్చేయాలి? అంగీకరించం.

- చాంబర్ వైస్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్


భవనం సినీ పరిశ్రమకే ఉండాలి

పరిశ్రమ ఎదగడంలో భాగంగా మారిన భవంతులను కూలగొడతామంటే బాధగా ఉంది. మేము అభివృద్ధికి వ్యతిరేకం కాదు. ఈ రోజు ఫిల్మ్ నగర్ అంటే హైదరాబాద్‌కే ఐకాన్. సినీ పరిశ్రమకు కేంద్ర బిందువు. అక్కడ జరిగే ప్రతీ అభివృద్ధి కార్యక్రమంలో సినీ పరిశ్రమను భాగస్వామ్యం చేయాలి. సీఎం రేవంత్ హైదరాబాద్‌ను వినోద రంగానికిప్రపంచంలోనే కేంద్ర స్థానంగా మారుస్తామంటున్నారు. అలాంటప్పుడు ఇక్కడ ఎలాంటి భవంతులు కట్టినా అది తెలుగు పరిశ్రమకు ప్రతిష్టను తెచ్చేదిగా ఉండాలి. దానిలో పరిశ్రమ సంబంధిత కార్యక్రమాలు మాత్రమే నిర్వహించుకొనేలా ఉండాలి

- డి.సురేష్‌బాబు, ప్రముఖ నిర్మాత

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

జటాధరుడికి జో లాలి



సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రధారులుగా దర్శకద్వయం వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కించిన సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర'. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేశ్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్ నిర్మించారు. నవంబరు 7న తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఇటీవలె విడుదలైన టీజర్, ట్రైలర్‌కు మంచి స్పందన లభించింది. తాజాగా మేకర్స్ 'జో లాలి జో...' అంటూ సాగే పాటను విడుదల చేశారు. శ్రీమాన్ కీర్తి సాహిత్యానికి రాజీవ్ రాజ్ అద్భుతమైన స్వరాలు సమకూర్చారు. పావని వాసా, రాజీవ్ రాజ్ మైమరిపించేలా ఆలపించారు.



శరవేగంగా చిత్రీకరణ

వరుణ్ తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ ఓ హారర్ కామెడీ చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న విషయం తెలిసిందే. 'వీటీ15' అనేది వర్కింగ్ టైటిల్. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. వరుణ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. వరుణ్ తేజ్, ప్రధాన తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. 'వరుణ్ కెరీర్‌లోనే ఈ సినిమా ప్రత్యేకంగా ఉండబోతోంది. 'తొలిప్రేమ' తర్వాత వరుణ్- తమన్ కాంబినేషన్‌లో మరోసారి అదరగొట్టే ఆల్బమ్ రానుంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని ఆసక్తికర అప్డేట్స్ త్వరలో ఇవ్వబోతున్నాం' అని మేకర్స్ తెలిపారు.



రష్మికకు అవార్డు ఖాయం

అల్లు అరవింద్

'ఈ 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రం కథను రాహుల్ నాలుగేళ్ల క్రితం చెప్పాడు. 'ఆహా'కు వెబ్ సిరీస్ చేయాలనే ప్లాన్‌లో ఉన్నాడు. కానీ, ఇలాంటి మంచి కథతో సినిమా చేస్తేనే బాగుంటుందని అనిపించింది. ఈ కథలో హీరోయిన్ క్యారెక్టర్ చాలా ఇంటెన్స్‌గా ఉంటుంది. అలాంటి పాత్రకు రష్మిక మాత్రమే న్యాయం చేయగలదు అని అనిపించింది. తను నాకు కూతురు లాంటిది. ఈ సినిమాలో నటనకు గాను రష్మికకు ఉత్తమ నటి అవార్డు రావడం ఖాయం' అని అన్నారు నిర్మాత అల్లు అరవింద్. రష్మిక మందన్న లీడ్ రోల్‌లో రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించిన చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. దీక్షిత్ శెట్టి కథానాయకుడు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్లపై అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించారు. నవంబరు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన వేడుకలో ట్రైలర్‌ని విడుదల చేశారు. రష్మిక మాట్లాడుతూ 'ఈ చిత్రం కథ విన్నప్పుడు ఇప్పటివరకూ ఇలాంటి ప్రేమ కథని మనం చూడలేదనిపించింది. మనందరి జీవితాల్లో ఇలాంటివి జరుగుతాయి కదా అని అనిపించింది. ఇందులో భూమా అనే పాత్రలో నటించాను. నా కెరీర్‌లో సరైన సమయంలో సరైన ఎంపిక ఈ ప్రాజెక్టు' అని అన్నారు. రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ 'నేను విద్యార్థిగా హాస్టల్‌లో ఉండే రోజుల్లో అనుకున్న కథ ఇది. ట్రైలర్‌లో చూపించినట్లే సినిమా ఆద్యంతం మనసును కదిలించే భావోద్వేగాలతో ఉంటుంది. ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ 'రష్మిక లేకుంటే 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమానే లేదు. దీక్షిత్ మాకు దొరికిన గొప్ప నటుడు. ఈ చిత్రం తర్వాత ఆయన టాలీవుడ్‌లో మరో పదేళ్లు వరుసగా సినిమాలు చేస్తారు' అని అన్నారు.

గుర్తుండిపోయే విజయం


ప్రదీప్ రంగనాథన్

"డ్యూడ్' సినిమా వంద కోట్ల వసూళ్లను అధిగమించింది. ప్రేక్షకుల ఆదరణ లేకపోతే ఇది సాధ్యమయ్యేది కాదు. గుర్తుండిపోయేలా అద్భుత విజయాన్ని అందించిన ఆడియన్స్‌కు కృతజ్ఞతలు. హౌస్‌ఫుల్ కలెక్షన్లతో సినిమా దూసుకుపోతోంది' అని అన్నారు హీరో ప్రదీప్ రంగనాథన్. ఆయన కథానాయకుడిగా, మమిత బైజు కథానాయికగా కీర్తీశ్వరన్ తెరకెక్కించిన చిత్రమిది. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై వై. రవిశంకర్, నవీన్ యెర్నేని నిర్మించారు. ఇటీవలె సినిమా విడుదలై ప్రేక్షకాదరణతో థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతున్న సందర్భంగా చిత్రబృందం విజయోత్సవ వేడుకను నిర్వహించింది. చిత్ర దర్శకుడు కీర్తీశ్వరన్ మాట్లాడుతూ 'నా తొలి చిత్రం మైత్రీ బేనర్‌లో భారీ విజయాన్ని అందుకొన్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఇంత గొప్పగా ఆదరించిన తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు. నిర్మాత వై.రవిశంకర్ మాట్లాడుతూ 'మా సినిమాకు తెలుగుతో పాటు తమిళంలోనూ అద్భుతమైన ఆదరణ దక్కుతోంది. మా సంస్థలో పరిచయమైన భరత్ కమ్మ, నితీష్ రానా, బుచ్చిబాబు సానా పెద్ద దర్శకులుగా ఎదిగారు. ఇప్పుడు అదే కేటగిరీలో కీర్తీశ్వరన్ చేరినందుకు ఆనందంగా ఉంది' అని అన్నారు.





బాలీవుడ్ హాస్యనటుడు సతీశ్ షా కన్నుమూత



బాలీవుడ్ వెండితెరపై హాస్యనటుడిగా తనదైన ముద్ర వేసిన సతీశ్ షా(74) శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. కొన్నాళ్లుగా ఆయన మూత్రపిండాలకు సంబంధించిన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఇటీవలే కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స జరిగింది. అయినా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ముంబైలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఆయన పూర్తి పేరు సతీశ్ రవిలాల్ షా. 1951లో ముంబైలో జన్మించారు. పుణేలోని ప్రతిష్ఠాత్మక ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియాలో నటనలో శిక్షణ తీసుకున్నారు. హిందీ సినిమా చరిత్రలో అత్యుత్తమ హాస్య చిత్రాల్లో ఒకటిగా భావించే 'జానే భీ దో యారో' చిత్రంలో అవినీతిపరుడైన మున్సిపల్ కమీషనర్ డి మెల్లో పాత్రలో సతీశ్ నటన చిరస్మరణీయంగా నిలిచింది. అలాగే బాలీవుడ్ బ్లాక్‌బస్టర్స్ 'దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే, హమ్ ఆప్ కె హై కౌన్, మై హూనా, కల్ హో నా హో' లాంటి చిత్రాల్లో ఆయన సహాయ పాత్రల్లో అలరించారు. టీవీ రంగంలో సతీశ్ షా ప్రతిభను నిరూపించిన తొలి కార్యక్రమం 'యే జో హై జిందగీ'. ఈ హాస్య ధారావాహికలో 55 ఎపిసోడ్లలో 55 విభిన్న పాత్రలను పోషించి అరుదైన ఘనతను షా సాధించారు. 'సారాభాయ్ వర్సెస్ సారాభాయ్' షోలో అత్తాకోడళ్ల మధ్య తగవులు పెట్టే ఇంద్రవదన్ సారాభాయ్ పాత్రతో ఆయన బుల్లితెర ప్రేక్షకులకు చేరువయ్యారు. ఐదు దశాబ్దాల పాటు సాగిన ఆయన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో 200కు పైగా సినిమాలు, పలు టీవీ సీరియల్స్‌లో నటించి ప్రేక్షకులను అలరించారు. 1982లో ఆయన ఫ్యాషన్ డిజైనర్ మధు షాను వివాహం చేసుకున్నారు.

భావోద్వేగ ప్రేమ గాథ



మిన్హాజ్ రుమి, యష్నా ముత్తులూరి ప్రధాన పాత్రధారులుగా అఖిల్ రాజ్ తెరకెక్కిస్తోన్న ప్రేమ కథా చిత్రం 'దేవ్-పారు'. ఏకే ప్రొడక్షన్స్ బేనర్‌పై అఖిల్ రాజు దర్శకత్వంలో లోడీ ఫాహద్ అలీఖాన్ నిర్మిస్తున్నారు. శనివారం నిర్వహించిన కారక్రమంలో 'నా ప్రాణమంతా..' అంటూ సాగే ప్రేమ గీతాన్ని దర్శకుడు కృష్ణ చైతన్య ఆవిష్కరించారు. ఈ గీతానికి ఓషో వెంకట్ స్వరాలందించగా, కాలభైరవ ఆలపించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇది ఒక భావోద్వేగ ప్రేమ గాథ. యువతను బాగా ఆకట్టుకుంటుంది. మిన్హాజ్ అద్భుతంగా నటించాడు' అని చెప్పారు. మిన్హాజ్ రోమి మాట్లాడుతూ ' ఈ సినిమాలో ప్రేమ కథతో పాటు భావోద్వేగ సన్నివేశాలు, హాస్యం, వినోదం వంటి అన్ని హంగులూ ఉన్నాయి' అని అన్నారు. నిర్మాత అలీఖాన్ మాట్లాడుతూ 'కొత్త వారికి అవకాశం ఇవ్వాలనే తపన ఈ చిత్రంతో నెరవేరింది' అని పేర్కొన్నారు.





రద్దీ ప్రమాదాలను నియంత్రించాలి

● వార్ రూంని సందర్శించిన డీఆర్ఎం సుధేష్ణ సేన్



సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజనల్ ఆఫీసులో ఉన్న వార్ రూంని డీఆర్ఎం సుధేష్ణ సేన్ తొలి సారిగా శనివారం సందర్శించారు. ఏడీఆర్ఎం రమేష్‌కుమార్‌తో కలిసి వార్ రూంకి వెళ్లిన ఆమె అక్కడి కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రస్తుత పండగల సెలవుల రద్దీ నేపథ్యం లో రైల్వే స్టేషన్లకు అధిక సంఖ్యలో ప్రయాణికులు వచ్చే అవకాశం ఉన్నందున వార్ రూం నుంచి.. సిబ్బంది సీసీ టీవీల ద్వారా పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు పంపుతున్న సూచనలు, ఆదేశాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది 24 గంటలూ సీసీ టీవీ స్క్రీన్‌ల ముందుండి పరిశీలిస్తుండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రద్దీ కారణంగా ఎలాంటి ప్రమాదాలు జరక్కూడదని స్పష్టం చేశారు.

ఏఎన్‌యూ దూరవిద్య పరీక్ష ఫలితాలు విడుదల



పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న సీడీఈ డీన్ వి.వెంకటేశ్వర్లు

ఏఎన్‌యూ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ దూరవిద్య కేంద్రం ఈ ఏడాది జూలై, ఆగస్టులో నిర్వహించిన ఎంకామ్, ఎంహెచ్‌ఆర్ఎం ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో సెమిస్టర్, ఎంఏ జర్నలిజం ప్రథమ, ద్వితీయ, నాలుగో సెమిస్టర్లు, ఎంఎల్ఐసీ ప్రథమ, ద్వితీయ సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను దూర విద్య సంచాలకులు ఆచార్య వీ వెంకటేశ్వర్లు శనివారం విడుదల చేశారు. విద్యార్థులు రీ-వాల్యుయేషన్‌కు వచ్చే నెల 7లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఒక్కో పేపర్‌కు రూ.960 చెల్లించాలని చెప్పారు. పరీక్ష ఫలితాలను anucde.info వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.


నిత్యాన్నదాన పథకానికి విరాళం



విరాళం అందిస్తున్న పెనుమాక వాసులు

తాడేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీలక్ష్మి నరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి భక్తులు విశేషంగా విరాళాలు అందిస్తున్నారు. తాడేపల్లి మండలం పెనుమాక గ్రామానికి చెందిన కళ్లం శివారెడ్డి తన మనుమడు లోకోరెడ్డి సాయిరాణా ప్రతాప్‌రెడ్డి పేరుమీదుగా రూ.1,01,116లు, మనుమరాలు పోలిరెడ్డి మన్వితరెడ్డి పేరుమీదుగా మరో రూ.1,01,116 నిత్యాన్న ప్రసాదానికి శనివారం విరాళంగా సమర్పించారు.ఈ సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్ భక్తుల సేవా భావాన్ని ప్రశంసిస్తూ ఇలాంటి దాతృత్వం.. ఇతర భక్తులకు స్ఫూర్తిదాయకమన్నారు.

ప్రకాశం బ్యారేజీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



ప్రకాశం బ్యారేజ దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతో పాటు బ్యారేజి ఎగువన ఉన్న మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 84,494 క్యూసెక్కుల వరద నీరు శనివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 11.3 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగు వకు 83,983 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూ ర్పు డెల్టా కాలువకు 511 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, పశ్చిమ డెల్టాకు, గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేశారు.

సాగర్ నీటి నిల్వ 305.62 టీఎంసీలు

విజయపురిసౌత్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటిమట్టం శనివారం నాటికి 587.20 అడుగులు ఉంది. ఇది 305.62 టీఎంసీలకు సమానం. ఎడమ కాలువ ద్వారా 2,878, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 29,232, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 34,204 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 34,204 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

సత్రశాలలో 1.0752 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణా నదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన రెండు యూనిట్ల ద్వారా శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0752 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 2 గేట్లు 1.50 మీటర్లు, 1 గేట్‌ను మీటర్ మేర ఎత్తి పులిచింతలకు 18,406 క్యూసెక్కులు,టేల్‌రేస్ చానల్ ద్వారా 8,683 క్యూసెక్కులు మొత్తంగా 27,089 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల జలపాతం, హాలియా వాగుల నుంచి 27,527 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 టీఎంసీలకు సమానమన్నారు.

పులిచింతల నీటి నిల్వ 44.43 టీఎంసీలు

అచ్చంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శనివారం 44.43 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 12,674 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందలు, మొత్తం 17వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంలో అద్భుత ఫలితాలు

రైతు సాధికార సంస్థ వైస్ చైర్మన్ విజయ్ కుమార్



ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తున్న గ్లోబల్ ఇనిషియేటివ్ ఫర్ సస్టయినబిలిటీ బృందం

గుంటూరు సిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య రైతు సాధికార సంస్థ చేపడుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు అద్భుత ఫలితాలను అందిస్తున్నాయని సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం గ్లోబల్ ఇనిషియేటివ్ ఫర్ సస్టయినబిలిటీ బృందం గుంటూరు జిల్లాను సందర్శించింది. ఈ బృందంలో చైర్‌పర్సన్ ఆండ్రే హాఫ్‌మాన్, రొజాలీ హాఫ్ మాన్, సీఈఓ పవన్ సుఖ్‌దేవ్, గ్లోబల్ అలయన్స్ ఫర్ ఏ సస్టయి నబుల్ ప్లానెట్ సెక్రటరీ జనరల్ సత్య ఎస్.త్రిపాఠి ఉన్నారు. బృందం దుగ్గిరాల మండలం పెద్దపాలెం గ్రామంలోని పాడిబండ కృష్ణప్రసాద్ వరి కాంపాక్ట్ బ్లాకును సందర్శించింది. ప్రకృతి వ్యవసాయ పొలాలు, రసాయన వ్యవసాయ పొలాలను పోల్చి పరిశీలించింది. ప్రకృతి వ్యవసాయంలో రైజోషీత్ 95 సెం.మీగా, రసాయన పొలాల్లో 70 సెం.మీగా నమోదయింది. ప్రకృతి వ్యవసాయ బ్రిక్స్ విలువలు 18, రసాయన రైతుల పొలాల్లో 5 ఉండగా గమనించారు. ప్రకృతి పొలాల్లో టిల్లర్స్ సంఖ్య 45, రసాయన పొలాలలో 17 మాత్రమే గమనించారు. ఈ ఫలితాలు ప్రకృతి విధానాల ప్రభావాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయని విజయ్‌కుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. నూతక్కి గ్రామంలో 2016లో నలుగురు రైతులతో ప్రారంభమైన ప్రకృతి వ్యవసాయం.. 92 శాతం మంది రైతులు అవలంబిస్తున్నారని తెలిపారు. బృంద సభ్యులు రైతు శ్రీనివాస్‌రెడ్డి అరటి, పసుపు పంటల ను, అలాగే రామలింగారెడ్డి సాగు చేస్తున్న పసుపు, మొక్కజొన్న, పిల్లి పెసర ఏ-గ్రేడ్ మోడల్‌ను పరిశీలించారు. రైతుల అనుభవాలను తెలుసుకున్నారు. గ్రామంలోని పద్మశ్రీ మహిళా సంఘ సమావేశంలో మహిళల పాత్రను బృందం ప్రత్యేకంగా ప్రశంసించింది. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి, థీమాటిక్ లీడ్స్ చంద్రశేఖర్, వాణిశ్రీ, స్థానిక రైతులు, మహిళ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

స్టాలిన్‌బాబు ఉద్యమ స్ఫూర్తి.. నేటి తరానికి ఆదర్శం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరరావు



స్టాలిన్ బాబు పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న గుజ్జుల ఈశ్వరయ్య, ముప్పాళ్ల నాగేశ్వరరావు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కార్మికులు, ఉద్యోగులు, రైతుల సమస్యల పరిష్కారానికి బొప్పూడి స్టాలిన్‌బాబు చేసిన పోరాటాలు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరరావు అన్నారు. శనివారం బొప్పూడి స్టాలిన్‌బాబు పార్థీవదేహానికి పార్టీ నాయకులతో కలిసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఈశ్వరయ్య మాట్లాడుతూ జీవితాంతం ప్రజల కోసం కష్టపడ్డ వ్యక్తి స్టాలిన్‌బాబు అని కొనియాడారు. ఆయన క్రమశిక్షణ, నేటి కమ్యూనిస్టు కార్యకర్తలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ స్టాలిన్ పేద ప్రజల హక్కుల సాధనకు పోరాడి వారి నమ్మకాన్ని సంపాదించారని గుర్తుచేసుకున్నారు. ఆయన చూపిన మార్గం మాకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ స్టాలిన్ ఆశయాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీపీఐ నాయకులు కోట మాల్యాద్రి, ఆకిటి అరుణ్‌కుమార్, రావుల అంజిబాబు, పచ్చల శివాజీ, జి.సురేష్‌బాబు, రాజేంద్ర, సంతోష్, వల్లూరు తాండవకృష్ణ తదితరులు స్టాలిన్‌బాబుకు ఘనంగా నివాళర్పించి, ఆయన సేవలను కొనియాడారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి స్నూకర్ పోటీలు



స్నూకర్ పోటీల్లో తలపడుతున్న ఎల్వీఆర్ క్లబ్ క్రీడాకారుడు షేక్ అన్వర్

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ బిలియర్డ్స్ అండ్ స్నూకర్ ర్యాంకింగ్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మూడో రోజు స్నూకర్ పోటీల్లో షేక్ అన్వర్, రఫాయత్, వి. సుశీల్ కుమార్, ప్రశాంత్, నిశాంత్ ముందంజలో ఉన్నట్లు నిర్వాహక కార్యదర్శి పులివర్తి వెంకటేశ్వరరావు(అజార్) తెలిపారు. వచ్చే నెల 3 వరకు పోటీలు జరుగుతాయని చెప్పారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు అన్ని సదుపాయాలు కల్పించామన్నారు.

స్నూకర్ ఫలితాలు

ఎండి రోషన్, షేక్ అల్తాఫ్‌పై 3-0 స్కోర్‌తో, లక్ష్మణ్, సయ్యద్ అబ్దుల్లా పై 3-0 స్కోర్‌తో, ముస్తఫా, పి.వాసుపై 3-0 స్కోర్‌తో, అవినాష్, పి.వెంకటేశ్వరరావుపై 3-0 స్కోర్‌తో, సయ్యద్ రిజ్వాన్, చంద్రకాంత్‌పై 3-0 స్కోర్‌తో, ప్రభు కిషోర్, ఎన్.వెంకటేశ్వర్ రెడ్డిపై 3-1 స్కోర్‌తో, డి.బాబురావు, ఫన్నీపై 3-2 స్కోర్‌తో, ఎస్కే ఆసిఫ్, సయ్యద్ రియాజ్‌పై 3-1 స్కోర్‌తో, జి.వంశీకృష్ణ, ఎస్.బాలాజీపై 3- 2 స్కోర్‌తో, డి.వంశీకృష్ణ, క్రాంతికుమార్‌పై 3-2 స్కోర్‌తో, శ్రీజన్‌బాబు, షేక్ తాజుద్దీన్‌పై 3-0 స్కోరుతో గెలుపొందినట్లు తెలిపారు. జాఫర్ హుస్సేన్, జస్వంత్‌పై 3-1 స్కోర్‌తో, అనంత్, వి.హర్షపై 3-0 స్కోర్‌తో, జి.ప్రశాంత్ ఎన్ దీపక్‌పై 3-0 స్కోర్‌తో, నిశాంత్, ప్రతాప్‌పై 3-0 స్కోర్‌తో, వి.సుశీల్‌కుమార్, డి.నాగే శ్వరావుపై 3-0 స్కోర్‌తో, షేక్ అన్వర్, టి.రాజేష్‌పై 3-2 స్కోర్‌తో, భాను, పీఎస్సీ రాహుల్ పై 3-2, రఫాయత్, సతీష్ పై 3-0 స్కోర్‌తో గెలుపొందారని పులివర్తి వెంకటేశ్వరరావు తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి అనగాని

రేపల్లె, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మొంథా తుపానుగా మారడంతో అధికారులు ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచించారు. ఈదురు గాలులతో కూడిన వర్షాలు సంభవిస్తే కొంత మేర ఇబ్బంది కలుగుతుందని.. అధికారులు ముందస్తుగానే ఆయా ప్రాంతాల్లో అత్యవసర సేవలు అందించే విధంగా ముందస్తు ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని ప్రకటించారు. అతి భారీవర్షాలు పడితే లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలను కూడా సిద్ధం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతిజిల్లాల్లో వర్షాలు పడే పరిస్థితి నెలకొందని ఆయాప్రాంత అధికారులు అన్ని శాఖల సమన్వయంతో ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకుంటూ చర్యలు తీసుకోవాలని సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పోటీ

సత్తెనపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ఉన్న జనసేన రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తుందని జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం సత్తెనపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో జనసేన ప్రజా సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో జన సైనికులు కూటమి ప్రభుత్వానికి సహకరిస్తున్నారని పేర్కొన్నారు. జన సైనికులకు పదవులు ముఖ్యం కాదని, ప్రజలు ముఖ్యమన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన కార్యకర్తలు కూడా వివిధ పదవుల్లో పోటీ చేసేందుకు ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. ఆయనతో పాటు శిరిగిరి శ్రీనివాసరావు, తవిటి భవన్నారాయణ ఉన్నారు.

27, 28 తేదీల్లో ఐఈఆర్‌పీ టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరు(విద్య), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఐఈఆర్‌పీ(ప్రత్యేక అవసరాల విద్య) టీచర్లకు ఈ నెల 27, 28 తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు డీఈవో సీవీ రేణుక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, బాపట్ల జిల్లాల వారికి 27న, 28న పల్నాడు జిల్లా అభ్యర్థులు హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు www.deognt.blogspot.com వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

ముంచుకొస్తోన్న.. మొంథా

(5వ పేజీ తరువాయి)

చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ముందస్తు చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. ఏర్పాట్లపై కలెక్టర్లు సమీక్షిస్తున్నారు.

దిగుబడుల వేళ ముంపు

ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభంలో వర్షాలు ముఖం చాటేశాయి. మేలో ఎక్కువగా వర్షాలు కురిశాయి. ఆ తర్వాత సుమారు రెండు నెలల పాటు ముఖం చాటేశాయి. ఆగస్టు నుంచి మళ్లీ వర్షాలు కురుస్తున్నాయి. ఒకే రోజున 220 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైన సందర్భాలు కూడా ఉన్నాయి. గత ఏడాది కూడా ఇలానే ఆగస్టు, సెప్టెంబరులో భారీ వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ సంవత్సరం కొంచెం ఆలస్యంగా ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుని రైతులు చేపట్టారు. దీంతో వరి, పత్తి తదితర పంటలు ఇంకా కోతలు చాలా చోట్ల మొదలుకాలేదు. నవంబరు మొదటి వారం తర్వాత కోతలు ఊపందుకుంటాయని అధికారులు భావిస్తూ అందుకు అనుగుణంగా ధాన్యం సేకరణ, పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. బాపట్ల జిల్లాలో 2,30,000 ఎకరాల్లో వరి సాగవగా 50 శాతం కోతలకు సిద్ధంగా ఉంది. గుంటూరు జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా పంటలు కోత దశలో ఉన్నాయి. పల్నాడు జిల్లాలో అత్యధికంగా పత్తి సాగవగా కోత దశకు చేరింది. కంది పంట కూడా వర్షాలకు ఉరకెత్తుతోంది. పత్తి, కంది, వరి పంటలకు వర్షాలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. చేలల్లో పెద్దఎత్తున వర్షపు నీరు చేరి పూత, పిందె తడిసిపోయాయి. రెండు నెలల వయస్సులో ఉన్న మిర్చి మొక్కలు నీటిలో కుళ్లిపోతున్నాయి. ఎక్కువ రోజులు మొక్క నీటిలో ఉండటంతో తెగుళ్ల సోకుతున్నాయి. శుక్రవారం సాయంత్రానికి వర్షాలు తగ్గుముఖం పట్టగా శనివారం కొన్ని ప్రాంతాల్లో ఎండ వచ్చింది. దీంతో రైతాంగం కొంతమేర ఊపిరి పీల్చుకుంది. ఎలాగోలా సస్యరక్షణ చర్యలు చేపట్టి కోతలు మొదలు పెడదామనుకుంటున్న తరుణంలో మొంథా తుపాను హెచ్చరికలతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. అధికవర్షపాతం నమోదైతే డ్రెయిన్లు, పంట కాల్వల్లో నుంచి నీరు పొంగి పొలాల్లో ప్రవహించి రోజుల తరబడి నిలబడిపోయే ప్రమాదం ఉన్నది. ఇప్పటికే పెట్టుబడులు ఖర్చులు కూడా రాని విధంగా పలు దఫాలుగా వర్షాలు తమను కుదేలు చేశాయని, రాబోయే నాలుగు రోజులు భారీ వర్షాలు నమోదైతే పంటలు ఏమీ మిగలవనే ఆవేదనను రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

యూరియా బస్తా రూ.450

(5వ పేజీ తరువాయి)

విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోయి పత్తి, మిరప, కంది పంటలు ఉరకెత్తి ఎండిపోతున్నాయి. ఆయా పంటలను కాపాడుకునేందుకు పొలంలో నిలిచిన నీరు బయటకు పంపి.. యూరియా పంటకు వినియోగించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు యూరియా కొనుగోలు చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాలకు యూరియా సరఫరాను వారం రోజులుగా నిలిపివేశారు. అక్కడక్కడా కొన్ని సొసైటీల్లో మాత్రమే యూరియా నిల్వలు ఉన్నాయి. అధిక వర్షాల వల్ల యూరియాకు డిమాండ్ ఏర్పడడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. కొందరు వ్యాపారులు అధిక ధరకు యూరియాను విక్రయిస్తున్నారు. ప్రభుత్వం యూరియా బస్తా ధర రూ.266.65గా నిర్ణయించింది. అయితే కొన్ని మండలాల్లో బస్తా రూ.420 నుంచి రూ 450 వరకు విక్రయిస్తున్నారు. అధిక ధరలను నియంత్రించడంలో వ్యవసాయ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నెలాఖరు వరకు కష్టం..

కొన్ని సొసైటీలకు సరఫరా చేసే ఎరువులు రాజకీయ అండదండలు ఉన్న రైతులకే అందుతున్నాయన్న విమర్శలున్నాయి. సొసైటీల కంటే ఆర్ఎస్‌కేల ద్వారా ఎరువులు విక్రయిస్తే అందరికి న్యాయం జరుగుతుందని రైతులు చెబుతున్నారు. ఈ నెలాఖరు వరకు రైతు సేవా కేంద్రాలకు యూరియా సరఫరా చేసే అవకాశం లేదని తెలుస్తోంది. ఈ-క్రాప్ బుకింగ్ ఈ నెలాఖరుకు పూర్తి చేయాలి. దీంతో ఆర్ఎస్‌కేలకు ఎరువులను సరఫరా చేస్తే పంట నమోదు పూర్తి కాదన్న వాదనను వ్యవసాయశాఖ అధికారులు వినిపిస్తున్నారు. అప్పటి వరకు రైతులు ప్రైవేట్ వ్యాపారులపైనే ఎరువుల కోసం ఆధారపడాల్సి ఉంది. దీనిపై వ్యవసాయ శాఖ జేడీని వివరణ కోరగా అధిక ధరకు యూరియా విక్రయిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే అధిక రేట్లకు ఎరువులు విక్రయించిన ఆరు షాపులపై కేసులు నమోదు చేశామన్నారు. ఎక్కడైనా అధిక రేటుకు ఎరువులు విక్రయిస్తే సమీప వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు. యూరియా నిల్వలు జిల్లాలో సమృద్ధిగా ఉన్నాయని చెప్పారు.

నీటి సంఘాలకు.. జీఎస్టీ బాదుడు!

(5వ పేజీ తరువాయి)

సదరు నీటి సంఘాల సభ్యులు వాపోతున్నారు. తాము కాంట్రాక్టర్లం కాదని, జీఎస్టీని రద్దు చేయాలని.. బిల్లుల నుంచి మినహాయించరాదని వారు కోరుతున్నారు. మినహాయించిన జీఎస్టీని ఇన్‌పుట్ బిల్లులు దాఖలు చేస్తే తిరిగి చెల్లించే అవకాశం ఉంటుందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే కాలువల మరమ్మతులకు ఇన్‌పుట్ బిల్లులు ఎలా ఉంటాయని నీటి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. మొత్తం మీద జీఎస్టీ కోత నీటి సంఘాలకు మింగుడుపడనిదిగా ఉంది. ప్రభుత్వం జీఎస్టీ విషయంలో పునరాలోచన చేయాలని నీటి సంఘాలు కోరుతున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 144, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

బాపట్ల వార్తలు

రోడ్ల అభివృద్ధికి రూ.60.75 కోట్లు మంజూరు

● ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్


ఎంపీ కృష్ణప్రసాద్

బాపట్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మూల ధన పెట్టుబడి ప్రత్యేక సహాయనిధి కింద కేంద్రప్రభుత్వం బాపట్ల పార్లమెంట్ పరిధిలోని రోడ్ల అభివృద్ధికి రూ.60 కోట్ల 75 లక్షలు మంజూరు చేసినట్లు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. ప్రత్యేక చొరవ తీసుకొని రాష్ట్రమూల ధన పెట్టుబడి ప్రత్యేక సహాయ పథకం కింద నిధులు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన కేంద్రప్రభుత్వం జిల్లా రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిందన్నారు. సింగరకొండ-అంబటిపూడి రోడ్డు, పంగులూరు-నిడబనూరు రోడ్లకు రూ.3 కోట్లు, పెనుమూడి-లంకవాని దిబ్బ రోడ్డుకు రూ.10కోట్ల 20 లక్షలు, కర్లపాలెం-గణపవరం రోడ్డుకు, పెద పులుగువారిపాలెం రోడ్డుకు రూ.4 కోట్ల75 లక్షలు, పర్చూరు నుంచి బేతపూడి-పల్లెకోన ఆర్ అండ్ బీ రోడ్డు, భట్టిప్రోలు మండలం కూచిపూడి, గోవాడ రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్ల 50 లక్షలు, చంద్రపేట-వేటపాలెం రోడ్డుకు రూ.3 కోట్ల 50 లక్షల చొప్పున మంజూరు చేసినట్లు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు.

ప్రజా సేవలో ప్రతి అడుగు అంకితం

● ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ● బాపట్లలో 5కె మారథాన్ రన్

బాపట్ల, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల త్యాగాలే స్ఫూర్తిగా ప్రజల సేవలో ప్రతి అడుగు అంకితం చేయాలని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పోలీసులకు, యువతకు పిలుపునిచ్చారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా శనివారం 5కె మారథాన్ రన్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి మారథాన్ రన్‌లో పాల్గొని ఉత్సాహం నింపారు. ఎస్పీ మాట్లాడుతూ వారోత్సవాలు ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ యువతలో స్ఫూర్తిని నింపేందుకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్వరలో వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. 5కె రన్ మారథాన్‌లో ఓవరాల్ విజేతగా బాపట్ల వ్యవసాయ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యనభ్యసిస్తున్న బి.మనోహర్, పీజీఆర్ఎస్ సెల్‌లో విధులు నిర్వహించే సివిల్ కానిస్టేబుల్ పి.నాగబ్రహ్మారెడ్డి, వ్యవసాయ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థి బసల్ బోబాన్‌లు వరుస మూడు స్థానాలలో నిలిచారు. పోలీసుల కేటగిరిలో జి.కృష్ణ, సీహెచ్ దుర్గాప్రసాద్, విద్యార్థుల కేటగిరిలో డి.మహేంద్ర, బసల్ బోబాన్, పి.వినయ్‌కుమార్, మహిళా విద్యార్థినీలలో డి.దీపిక, జి.భార్గవి, షేక్.ఫిరోజకౌశర్బీలు వరుస మూడు స్థానాలలో నిలిచారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.విజయసారధి, బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు, ఎస్బి ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ, పట్టణ సీఐ ఆర్.రాంబాబు, ఆర్ఐలు షేక్.మౌలుద్దీన్, టి.శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.


5కె మారథాన్ రన్ ప్రారంభిస్తున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

పంట పొలాలను పరిశీలించిన ఆర్డీవో


పొలాలను పరిశీలిస్తున్న ఆర్డీవో గ్లోరియా, రెవెన్యూ, వ్యవసాయశాఖాధికారులు

పిట్టలవానిపాలెం, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భవనంవారిపాలెం, కోమలి గ్రామాలలో వాయుగుండం కారణంగా కురిసిన భారీ వర్షాలకు మునిగిన వరి పంట పొలాలను శనివారం బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా మండల రెవెన్యూ, వ్యవసాయశాఖాధికారులతో కలిసి పరిశీలించారు. రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె అన్నారు. రెవెన్యూ, మండల వ్యవసాయశాఖాధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సహాయకులు కె.ధనరాజు, పిట్టలవానిపాలెం తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయశాఖాధికారి సీహెచ్ సత్యానంద్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కర్రి శ్రీనివాసరావు, మండల వ్యవసాయ విస్తరణాధికారి సీహెచ్ సుదర్శనరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు సయ్యద్ బాజి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం సందర్శన

పిట్టలవానిపాలెం తహసీల్దార్ కార్యాలయానికి ఆర్డీవో గ్లోరియా విచ్చేసి తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సీహెచ్ శేఖర్, వివిధ గ్రామపంచాయతీ కార్యదర్శులతో కలిసి ప్రస్తుత వర్షాలు పీజీఆర్ఎస్ కార్యక్రమాలు, వివిధ అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కె.శ్రీనివాసరావు, వీఆర్వోలు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెం మండలంలో...

కర్లపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా రానున్న నాలుగు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో గ్లోరియా అన్నారు. శనివారం కర్లపాలెం గ్రామంలోని పంట పొలాలను ఆమె పరిశీలించారు. పొలాల్లో ఉండే నీళ్లను సాధ్యమైనంత వరకు త్వరగా బయటకు పంపాలని, పంట డ్రైనేజికి సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకొస్తే త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. ప్రస్తుతానికి మండలంలో ఎటువంటి పంట నష్టం జరగలేదని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షాకీర్ పాషా, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో సుమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి : తహసీల్దార్

తుఫాన్ కారణంగా మండల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కర్లపాలెం తహసీల్దార్ షాకీర్ పాషా అధికార యంత్రాంగానికి సూచించారు. ఆయా గ్రామాల వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేసి వారికి అవసరమైన సేవలందించాలన్నారు.

లోతట్టు ప్రాంతాలలో ఇంజన్లు ఏర్పాటు

బాపట్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు కారణంగా లోతట్టు ప్రాంతాలలో నిలిచిన వర్షపునీటిని బయటకు పంపించేందుకు మున్సిపల్ అధికారులు ఇంజన్‌లు ఏర్పాటు చేశారు. గంగపుత్రకాలనీ, రాజీవ్‌గాంధీకాలనీ, చెంగల్రాయుడుతోట, ప్యాడిసన్‌పేట, 11వ వార్డు రాజీవ్‌గాంధీకాలనీ తదితర ప్రాంతాలలో ఇంజన్‌లు ఏర్పాటు చేసి నీటినిబయటకు పంపిస్తున్న ఏర్పాట్లను ఆర్డీవో పి.గ్లోరియా, కమిషనర్ జి.రఘునాథరెడ్డి, తహసీల్దార్ షేక్ సలీమా, మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి తదితరులు కలిసి శనివారం పరిశీలించారు. నిలిచిన నీటి మొత్తాన్ని బయటకు పంపించి శానిటేషన్ పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని వారు తెలిపారు.

అర్హులైన క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలి

బాపట్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం అందించే అత్యున్నత మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న, అర్జున, ద్రోణాచార్య అవార్డులతోపాటు రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారాలకు సంబంధించి అర్హులైన క్రీడాకారులు ఈనెల 28 రాత్రిలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి గుంటూరు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

పర్యాటకుల సామాన్లు భద్రపరుచు గది, గొడుగు బల్లల వేలం

బాపట్లరూరల్, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం అడవిగ్రామ పంచాయతీ పరిధిలోని సూర్యలంక తీరం వద్ద గల పర్యాటకుల సామాన్లు భద్రపరుచు గది, గొడుగు బల్లలకు శనివారం బాపట్ల డిప్యూటీ ఎంపీడీవో జి.రామకృష్ణ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. ఈవేలం పాటలో సామాన్లు భద్ర పరుచు గది రూ.లక్షా 9 వేలకు పర్రె కోటయ్య దక్కించుకోగా గొడుగుబల్లలు రూ.5 లక్షల 500కు జంగం దాసు పాటలో దక్కించుకున్నారు. ఈ వేలం పాటలో మొత్తం 25 మంది పాల్గొనటం జరిగిందని తెలిపారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన ఎంపీడీవో

బాపట్ల రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం కంకటపాలెం గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను బాపట్ల ఎంపీడీవో బి.బాబురావు శనివారం పరిశీలించారు. డ్రైనేజి పూడికతీత పనులను పరిశీలించి పంచాయతీ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మరియమ్మ, సర్పంచ్ వందనం తదితరులు పాల్గొన్నారు.


సురక్ష యాప్ గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు


ఎక్సైజ్ అధికారులతో కలిసి పోస్టర్ అవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన అవసరం

● ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : అక్రమ, కల్తీ మద్యం వినియోగాన్ని అరికట్టేందుకు ప్రజలు ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సూచించారు. శనివారం గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో ఆయన సురక్ష యాప్ గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్రమ మద్యపాన నివారణకు, ప్రజాభద్రత ప్రచారాన్ని కొనసాగించాలని ఎక్సైజ్ శాఖకు సూచించారు. జగన్ ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడిందని, ఆనాడు నకిలీ కల్తీ మద్యం ఏరులై పారడంతో పాటు వేలాది కుటుంబాలు ప్రాణాలు కోల్పోవడంతో పాటు మరెందరో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడ్డారని విమర్శించారు. నకిలీ మద్యం వ్యాపారం ద్వారా కోట్లాది రూపాయలు దోచుకున్నారని అందుకు స్పష్టమైన సమాచారం ఉందన్నారు. అందుకు అధికారులు కూడా మద్దతుగా వ్యవహరించారన్నారు. ప్రజా భద్రత ప్రాధాన్యంగా గుర్తించి కూటమి ప్రభుత్వం పారదర్శకతకు కట్టుబడి ఉందన్నారు. ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతామన్నారు. ప్రతి మద్యం సీసాపైన ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఉత్పత్తి నాణ్యతను ధ్రువీకరించుకోవాలని సూచించారు. కల్తీ మద్యం మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సీఐ రవి, జనసేన పార్టీ సమన్వయకర్త ఉసా రాజేష్, చావలి సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాసరావు, టీడీపీ రైతు విభాగం నాయకులు బండారు సూరిబాబు, బూతుమల్లి గ్రామ టీడీపీ నాయకులు వేమూరి శేషుబాబు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ మద్యం అరికట్టడానికి కూటమి ప్రభుత్వం కృషి : వేగేశన

బాపట్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని అరికట్టటానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. పట్టణంలోని సూర్యలంకరోడ్డులో మిత్రవైన్స్ మద్యం దుకాణం వద్ద శనివారం ఎక్సైజ్ అధికారులతో కలిసి ఆయన మద్యం బాటిల్స్‌ను పరిశీలించారు. ఎక్సైజ్ సురక్షయాప్ పోస్టర్‌లు ఆవిష్కరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నకిలీ మద్యం కట్టడి కోసం టెక్నాలజి బాటలో రాష్ట్ర ప్రభుత్వం పయనిస్తుందన్నారు. ఏపీ ఎక్సైజ్ సురక్షయాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. బార్ కోడ్ స్కాన్ చేస్తే మద్యం బాటిల్‌కు సంబంధించిన అన్ని వివరాలు వెంటనే మీ మొబైల్‌లో కనిపిస్తాయని అన్నారు. వినియోగదారులు కూడా ఈ యాప్ ద్వారా తయారి తేది, టైమ్, బ్యాచ్‌నెంబరు వంటి వివరాలు చెక్ చేసుకోవాలన్నారు. ప్రతి బాటిల్‌కు ట్రేసబిలిటి, సర్టిఫికేషన్ సదుపాయాలు ఉంటాయని తెలిపారు. ఒక షాపునకు సరఫరా చేసిన మద్యం మరొక షాపులో అమ్మటం సాధ్యంకాదన్నారు. టెక్నాలజితో మద్యం నియంత్రణలో కొత్త దశకు రాష్ట్ర ప్రభుత్వం అడుగుపెడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఒంగోలు అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ, బాపట్ల డీపీఈవో బి.వెంకటేశ్వర్లు, సీఐ పి.గీతిక, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ చింతా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం : అనగాని


ఎక్సైజ్ సురక్ష యాప్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అనగాని శివప్రసాద్, ఎక్సైజ్ సిబ్బంది

నగరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నకిలీ మద్యంపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. శనివారం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల నగరం మండలంలోని సజ్జావారిపాలెం గ్రామంలో గల మద్యం దుకాణం వద్ద ఏపి ఎక్సైజ్‌సురక్షయాప్ పోస్టర్లు, కార్డు బోర్డ్, కరపత్రాలు ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఏపి ఎక్సైజ్‌సురక్షయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని బాటిల్ మూతపైగల క్యూఆర్‌కోడ్‌స్కాన్‌చేయడం ద్వారా మద్యం నాణ్యమైనదేనా కాదా తెలుసుకోవచ్చన్నారు. రేపల్లె నియోజకవర్గంలో ఎక్కడా కల్తీ మద్యం లేదన్నారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుట వలన ప్రజలను నకిలీ మద్యం బారినపడకుండా రక్షించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, ఎక్సైజ్ సిబ్బంది, తాతా ఏడుకొండలు, మత్తిభాస్కర్, దండమూడి శివనాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక స్నానాలు వాయిదా వేసుకోవాలి : ఎస్ఐ

కొల్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతి వల్ల కార్తీక స్నానాలు ఆచరించే భక్తులు వాయిదా వేసుకోవడం మంచిదని ఎస్ఐ అమరవర్ధన్ భక్తులకు సూచించారు. మండల పరిధిలోని చిలుమూరు ఉభయ రామేశ్వర క్షేత్రం సమీపంలోని కృష్ణానదిలో వరద ఉధృతిని శనివారం గజ ఈతగాళ్లతో పరిశీలన చేశారు. నది వద్ద పోలీసు సిబ్బందితో పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చుండూరులో తుఫాన్ కంట్రోల్ రూమ్

చుండూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికల కారణంగా చుండూరు తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ డి.నాగరాజారావు శనివారం తెలిపారు. మండల గ్రామస్థులు తుఫాన్‌కి సంబంధించి ఇబ్బందులు ఎదురైన వెంటనే కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు 9492923803లో సంప్రదించవలసినదిగా తహసీల్దార్ కోరారు.

క్విజ్ పోటీల్లో వెల్లటూరు జడ్పీహెచ్‌ఎస్ ప్రథమ స్థానం

భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : భట్టిప్రోలులోని మండల విద్యా వనరుల కేంద్రంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల స్థాయి క్విజ్ పోటీలను శనివారం ఎంఈవో దేవరాజు నిర్వహించారు. ఈ పోటీల్లో వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గణేష్, మహిధర్, సురేంద్రబాబు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఎంఈవో తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు మురళీమోహన్, ఎంఈవో అభినందించారు.

అయ్యప్ప స్వామి పూజలో పాల్గొన్న శివప్రసాద్

రేపల్లె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరం వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం యరగళ్ళ ధర్మతేజ దంపతులచే పంచ మండపాల అయ్యప్ప స్వామి పూజలో శివప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోర్ల శ్రీనివాసరావు గురుస్వామిచే పూజా కార్యక్రమాలు, అయ్యప్పస్వామికి అభిషేకం, నాగరాజు గురుస్వామి నిర్వహించారు. అనంతరం అయ్యప్పస్వామి నిత్యాభిషేకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. స్వాములకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరరావు, చెరుకుపల్లి మండల పార్టీ అధ్యక్షుడు తాతా ఏడుకొండలు, టీడీపీ నాయకులు వీవీ చింతారావు, కొపనాతి రాజశేఖర్, కె.రామకృష్ణ, పైడియ్య గురుస్వామి, లుక్కా గుడారంకయ్య పాల్గొన్నారు.

నగరం ఎస్‌వీఆర్ఎం కళాశాల విద్యార్థి ప్రతిభ

నగరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎస్‌వీఆర్ఎం కళాశాల విద్యార్థులు ఆటలలో రాష్ట్ర స్థాయిలో ప్రతిభకనబరచడం శుభపరిణామం అని కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ వల్లభనేని బుచ్చయ్యచౌదరి అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థి ఎ.నవీన్‌కుమార్‌రెడ్డి అద్వితీయ ప్రతిభకనపరచి ఆచార్యనాగార్జునయూనివర్శిటీ అంతర కళాశాలల ఫెన్సింగ్(మెన్)పోటీలలో ప్రథమబహుమతి సాధించి ఆల్‌ఇండియా యూనివర్శిటీ ఫెన్సింగ్ పోటీలకు సెలెక్ట్ అయ్యారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ, సూపరింటెండెంట్ పి.అమరేష్‌రెడ్డి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వి.సాంబమూర్తి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఘనంగా నాగుల చవితి వేడుకలు


బాపట్ల: పుట్టలో పాలు పోసి పూజలు చేస్తున్న భక్తులు

బాపట్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని చీలురోడ్డు సెంటర్‌లో పాండురంగస్వామి దేవాలయంలో నాగేంద్రస్వామి పుట్టలో పాలుపోసి దీపారాధనతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా క్రిస్టియన్‌పేటలోని పుట్ట వద్ద భక్తులు పెద్దఎత్తున పూజలు నిర్వహించారు. ఇంకా వివిధ దేవాలయాలలో పూజలు నిర్వహించి పాలు పోశారు.

● వేమూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి గ్రామాల్లో శనివారం నాగుల చవితి పర్వదినాన్ని భక్తులు భక్తితో నిర్వహించారు. పుట్టలలో, విగ్రహాలకు ఆవుపాలు పోసి పూజలు చేశారు. బలిజేపల్లి, అబ్బనగూడవల్లి, చావలి, పెరవలి, జంపని శివాలయాల్లో నాగేంద్రుని విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు జరిపారు. విష్ణు, శివ ఆలయాలను భక్తులు పెద్ద సంఖ్యలో సందర్శించారు. జంపనిలో కొందరు ముస్లింలు ఉపవాస దీక్షతో నాగుల చవితి పూజలు చేశారు.

● భట్టిప్రోలు, కొల్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నాగుల చవితి పర్వదినాన్ని శనివారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. భట్టిప్రోలు, కొల్లూరు మండల గ్రామాల్లో నాగేంద్ర స్వామి పుట్టల వద్ద భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి పుట్టల్లో పాలు పోశారు. కోనేటిపురంలోని వెంకటేశ్వర సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఉదయం 5 గంటల నుంచి భక్తులు ఆలయాలకు పోటెత్తడంతో నిర్వాహకులు క్యూ లైన్లు ఏర్పాటు చేసి పాలు పోసేందుకు భక్తులను వరుస క్రమంలో పంపించారు.

● పిట్టలవానిపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామపంచాయతీలలో నాగుల చవితి వేడుకలను మహిళలు అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించుకున్నారు. చందోలులోని శ్రీలింగోద్భవదేవస్థానంలో గల నాగేంద్రస్వామిపుట్టల వద్ద మహిళలు పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అలాగే మండలంలోని జీఎన్‌పాలెం, అల్లూరు, మంతెనవారిపాలెం, ఖాజీపాలెం, పిట్టువారిపాలెం, కోమలి, సంగుపాలెంకోడూరు, భవనంవారిపాలెం, పోతనకట్టవారిపాలెం, కొత్తపాలెం గ్రామపంచాయతీలలో ఆయా పుట్టల వద్ద నాగేంద్రస్వామికి పాలు పోసి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి, ఆలయ పాలకమండలి దేవస్థానం అధ్యక్షులు పరిమి రామకృష్ణసాయిబాబు పాల్గొన్నారు.

● చుండూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పలు గ్రామాల్లో నాగుల చవితి వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. చినపరిమిలోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలోని నాగేంద్ర స్వామి పుట్ట, యడ్లపల్లి, పెదగాదెలవర్రు, మోదుకూరు, దుండిపాలెం, మండూరు, చుండూరులోని నాగేంద్రస్వామి పుట్టలవద్ద ఉదయాన్నే మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పసుపు కుంకుమలతో పూలమాలతో పుట్టలను అలంకరించి పాలు పోసి నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కొన్ని పుట్టల వద్ద భక్తులకు అన్నదాన వితరణ చేశారు.


రేపల్లెలో నాగుల చవితి సందర్భంగా పుట్టలో పాలుపోస్తున్న భక్తులు

● రేపల్లె, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నాగుల చవితి సందర్భంగా శనివారం పలు శివాలయాల్లో ఉన్న పుట్టల్లో మహిళలు తెల్లవారుజామునుంచే పాలుపోసి చలిమిడి, అరటి పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గంలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లో ఉన్న పుట్టల్లో మహిళలు నాగేంద్రస్వామికి పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని రామకోటి శివాలయం, ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయం, పేటేరు రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయం, పాతపట్నంలో ఉన్న కోటలో నాగేంద్రస్వామి పుట్టల వద్ద పాలు పోసి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా శివాలయాల్లో శివుడ్ని దర్శించుకున్నారు.

● కర్లపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో శనివారం నాగుల చవితి పండుగ నిర్వహించారు. మహిళలు దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించుకొని నాగేంద్రస్వామి పుట్ట వద్ద పాలు పోసి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు.

వర్షాలకు దెబ్బతిన్న వరి పైరును పరిశీలించిన ఏడీఏ

వేమూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వరుసగా నాలుగు రోజులు పాటు కురిసిన వర్షాలకు పడిపోయిన పైర్లను శనివారం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు లక్ష్మి సందర్శించారు. జంపని, బూతుమల్లి, చంపాడు, వేమూరు గ్రామాల్లో పర్యటించి ఆయా రైతులతో మాట్లాడారు. ముంపునకు గురైనప్పుడు పొలంలో నీళ్లను అంతర్గత కాల్వల ద్వారా బయటకు తీయాలని సూచించారు. నిలిచిపోయిన పడిపోయిన పంటల్లో కంకిలో మొలకలు కనబడితే 50 గ్రాములు ఉప్పు ద్రావణాన్ని లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రేమ్‌సాగర్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.


జంపనిలో పడిపోయిన వరి పైరును పరిశీలిస్తున్న ఏడీఏ లక్ష్మి

పంటలో నిలిచిన నీటిని బయటకు పంపించాలి

కొల్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల కారణంగా వరి పంటలో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపించాలని రేపల్లె వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు లక్ష్మి అన్నారు. మండల పరిధిలోని క్రాప, కొల్లూరుతో పాటు పలు గ్రామాల్లో భారీ వర్షాలకు పడిపోయిన, నీట మునిగిన వరి పంటను క్షేత్రస్థాయిలో శనివారం ఆమె పరిశీలించారు. సుమారు 178 ఎకరాలు వర్షాల వల్ల వరి పంట నేలవాలినట్లు ఏడీఏకు ఏవో నరేంద్రబాబు వివరించారు. అనంతరం వివిధ దశల్లో ఉన్న వరి పంట బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా కురిసిన భారీ వర్షాలకు నేలవాలడం జరిగిందన్నారు. పంట దెబ్బతినకుండా రైతులు పంటలో దారులు చేసుకుని వర్షపు నీటిని బయటకు తరలించుకోవాలన్నారు. పంట దెబ్బతినకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అందుకు తగిన సలహాలు, సూచనలు తమ శాఖ అధికారులు వివరిస్తారని తెలిపారు. పరిశీలనలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల సంక్షేమానికి కృషి

● ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయిలో ఏ పార్టీ ఆలోచన చేయని విధంగా రాష్ట్రంలోని టీడీపీ కార్యకర్తల సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేస్తుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శనివారం అన్నారు. వేమూరుకు చెందిన భవన కార్మికుడు, కార్యకర్త రెడ్ల శివ దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో కార్యకర్తల ప్రమాద బీమా పత్రాలను ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర కార్యాలయానికి పంపారు. పరిశీలించిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆర్థిక సహాయం అందజేసేందుకు రూ.5 లక్షలు మంజూరు చేశారు. సంబంధిత చెక్కును శివ కుటుంబానికి ఎమ్మెల్యే ఆనందబాబు అందజేశారు. ఆయన మాట్లాడుతూ, పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ కార్యకర్తల సంక్షేమం కోసం బీమా పథకాన్ని అమలు చేయడం జరిగిందన్నారు. మృత చెందిన కార్యకర్తలకు చెందిన వివరాలను నియోజకవర్గ స్థాయిలో తనకు అందజేస్తే ఆ కుటుంబానికి తనవంతుగా సహకరిస్తానని అన్నారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, మరికొందరు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు భట్టిప్రోలులో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆదివారం పంపిణీ చేయనున్నట్లు శనివారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో భట్టిప్రోలు, కొల్లూరు మండలాలకు చెందిన లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా అందజేస్తారన్నారు.

మంత్రి ఆదేశాలతో పాలరేవు డ్రెయిన్‌లో తూటికాడ తొలగింపు


తూటికాడను తొలగిస్తున్న నీటిసంఘాల నాయకులు

రేపల్లె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మూడురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా నిజాంపట్నం పాలరేవు డ్రెయిన్ వద్ద విపరీతంగా కొట్టుకొచ్చిన తూటికాడ ఉండటంతో నీరు పారుదలకావటం లేదని మంత్రి అనగాని దృష్టికి రైతులు తీసుకుని వెళ్ళారు. దీంతో స్పందించిన ఆయన తక్షణమే నీటిపారుదల శాఖాధికారులు, నీటిసంఘాలు నాయకులతో పాలరేవు డ్రెయిన్‌లో పేరుకుపోయిన తూటికాడను తొలగించి వర్షపునీరు పారుదలయ్యేలా ఆదేశాలు జారీ చేశారు. పాలరేవు డ్రెయిన్‌లో పేరుకుపోయిన తూటికాడను శనివారం తొలగించామని నీటి సంఘాల అధ్యక్షుడు రాగం కల్యాణ్, రైతులు తెలిపారు.

బాలకోటేశ్వరస్వామి ఆలయ పాలక మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్

అమృతలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన అమృతలూరు మండలంలోని గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయ పాలకమండలి ఏర్పాటుకు రాష్ట్ర ధార్మిక పరిషత్ కార్యదర్శి కె.రామచంద్రమోహన్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆలయ ఈవో ఎంవీఎస్ వర్మ తెలిపారు. పాలకమండలి సభ్యులుగా ఆసక్తి ఉన్న వారు ఈనెల 30వ తేదీలోపు ఆలయ కార్యనిర్వాహణాధికారి, లేదా దేవదాయ శాఖ, బాపట్ల డీఈ కార్యాలయంలో కాని తమ దరఖాస్తులను అందజేయాలని కోరారు.

31వ తేదీ లోపు సర్వే పూర్తి చేయాలి

చెరుకుపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : స్వామిత్వ సర్వే చేస్తున్న టీం సభ్యులతో శనివారం ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని నడింపల్లి సచివాలయంలో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 31లోపు సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కేజీఏ శ్రీనివాసన్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, నడింపల్లి వీఆర్వో రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లపర్రు వృద్ధాశ్రమానికి చేయూత

నగరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రార్థించే పెదవులకన్నా సాయంచేసే చేతులు మిన్న అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మండలి వెంకట్రావు అన్నారు. మాజీ మంత్రి మండలి కృష్ణారావు శతజయంతి సందర్భంగా శనివారం నగరం మండలం అల్లపర్రు గ్రామానికి చెందిన వృద్ధాశ్రమానికి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కుమారుడు మండలి వెంకట్రావు రూ.20 వేల విలువ చేసే నిత్యావసర వస్తువులను ఆశ్రమ నిర్వాహకులు అల్లపర్తి సాంబయ్య, గుణసుందరి దంపతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రసాలయ సమితి అధ్యక్షుడు మల్లెల రామచంద్రరావు, కార్యదర్శి డాక్టర్ కోడే గౌరీశంకర్, సభ్యులు అన్నవరపు శ్రీనివాసరావు, గ్రామస్థులు గాజుల పోతురాజు, నున్న సుబ్బారావు, చిలక శ్రీను, జీ.అనిల్, దివి శ్రీను, అల్లపర్తి చంద్రం పాల్గొన్నారు.


నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్న మండలి బుద్ధప్రసాద్ కుమారుడు వెంకట్రావు

అవీ..ఇవీ..

కంటి విషయంలో జాగ్రత్తలు పాటించాలి

● నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ మనోజ్


శిబిరంలో పాల్గొన్న వైద్యులు

పంగులూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కంటి సంరక్షణలో ప్రతి వ్యక్తి తగిన జాగ్రత్తలు పాటించాలని శంకర్ నేత్రాలయ కంటి వైద్య నిపుణులు డాక్టర్ మనోజ్ అన్నారు. పంగులూరులో శనివారం రోటరీక్లబ్, శంకర్ నేత్రాలయ వారు ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బత్తుల వీరనారాయణ ప్రారంభించారు. ఈ ఉచిత వైద్యశిబిరంలో 25 మందికి డాక్టర్ మనోజ్ కంటి పరీక్షలు నిర్వహించారు. ఏడుగురికి కంటి శస్త్రచికిత్స అవసరంగా గుర్తించామన్నారు. కార్యక్రమంలో పీఆర్వో ఎం.రవి, హెల్త్ క్యాంప్ ఇన్‌చార్జ్ వీరరాఘవయ్య, క్లబ్ కార్యదర్శి రాయిని రామారావు, పోలిశెట్టి సీతారామయ్య, గుర్రం ఆంజనేయులు, ఐ.సుబ్బారావు, పోతిన ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

అద్దంకిటౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ధేనువకొండ మాజీ సర్పంచ్ నలజల వెంకటేశ్వర్లు(ఇంజనీరు) జ్ఞాపకార్థం ఆదివారం ధేనువకొండ పునరావాసకాలనీ బలరామకృష్ణపురంలోని పాఠశాల ఆవరణలో ఉదయం 9 గంటల నుండి ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు, ఎన్‌ఆర్‌ఐ నలజల నాగరాజు శనివారం తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శుభం ఫౌండేషన్, శంకర కంటి వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తిగత భద్రతతో ప్రమాదాల నుంచి రక్షణ

● విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

● విజేతలకు బహుమతులు అందజేసిన సీఐ


పోటీలను పరిశీలిస్తున్న సీఐ సుబ్బారావు

చీరాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత రక్షణతోనే ప్రమాదాల నుండి భద్రంగా ఉండవచ్చని వన్‌టౌన్ సీఐ సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కేజీఎం హైస్కూల్లో విద్యార్థులకు పోలీస శాఖ విధులు, 'గుడ్ టచ్ - బ్యాడ్ టచ్' వంటి అంశాలపై అవగాహన కల్పించారు. చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అలాగే ఎన్‌ఆర్‌పీఎం హైస్కూల్లో లైంగిక వేధింపులు, భద్రతచర్యలు వాటిపై అవగాహన కల్పించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సీఐ వెంట శక్తి టీం ఎస్సై హరిబాబు, కానిస్టేబుల్ సుబ్బారావు ప్రధానోపాధ్యాయులు సాల్మన్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

గోశాలకు దాణా అంజేత

అద్దంకిటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఆదివారం అద్దంకిలోని హరిహర గోశాలకు రూ.8 వేల విలువైన దాణాను గోశాల నిర్వహకుడు సుబ్బారావుకు రోటరీ క్లబ్ సభ్యులు అందజేశారు. గో సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు, సెక్రటరీ ఆలహరి హరిప్రసాద్, రామకోటేశ్వరరావు, చప్పిడి వీరయ్య, సుబ్రహ్మణ్యం, శివయ్య, అంజయ్య పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

అద్దంకి, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 10 మందిని శనివారం అద్దంకి కోర్టులో హాజరు పరిచారు. వారికి న్యాయాధికారి అఖిల రూ.43 వేల అపరాధం విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. ఒకరికి రూ.6 వేలు, మరొకరికి రూ.5 వేలు, మిగిలిన 8 మందికి 4 వేల రూపాయల చొప్పున న్యాయాధికారి అఖిల ఫైన్ విధించినట్లు తెలిపారు.

'ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

● అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు

మేదరమెట్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రానున్న మూడు రోజులు తుఫాను ప్రభావం తీవ్రంగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అద్దంకి రూరల్ సిఐ మల్లికార్జునరావు తెలిపారు. శనివారం మేదరమెట్లలో ఆ యన మాట్లాడుతు వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు తుఫాను ప్రభావం తీవ్రంగా ఉండే అ వకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచనలు పాటించాలని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు పెట్టుకోవద్దని మల్లికార్జునరావు తెలిపారు. తుఫాను తీవ్రంగా ఉన్న సమయంలో విద్యుత్ స్తంభాల కింద, చెట్ల కింద నిలబడవద్దన్నారు. వాతావరణశాఖ, జిల్లా అధికారులు ఇచ్చే సూచనలు అందరు పాటించాలన్నారు. ఏ దైన సమాచారం తెలిస్తే స్థానిక అధికారులకు తెలియజేయాలని మల్లికార్జునరావు తెలిపారు.

ఆధార్‌కార్డుల జారీకోసం ప్రత్యేక కేంద్రాలు


తూర్పు కొప్పెరపాడులో ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వరూపారాణి

పంగులూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):పాఠశాల విద్యార్థులకు ఆధార్‌కార్డుల జారీకోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల సేవలను విని యోగించుకోవాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి అన్నారు. మండలంలోని తూర్పు కొప్పెరపాడు, అలవలపాడు సచివాలయాలలో ప్రత్యేక ఆధార్ సెంటర్ల పనితీరును ఎంపీడీవో స్వరూపారాణి శనివారం పరిశీలించారు. పాఠశాల విద్యార్థులకు ఉచితంగా ఆధార్‌కార్డులు అందజేయనున్నట్లు తెలి పారు. ఈ కేంద్రాలు ఈనెల 29 వరకు పనిచేస్తాయన్నారు. కొండమంజు లూరు సచివాలయంలో ప్రత్యేక ఆధార్‌కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

కొద్దిరోజులుగా ఎడతెరపు లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలవద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో స్వరూపారాణి సూచించారు. మండలంలోని నూజెళ్లపల్లె ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జంపని వెంకటేశ్వర్లు(జేవీఆర్), వీరాంజనేయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

బల్లికురవ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బల్లికురవ జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని పదవ తరగతి విద్యార్థులకు రోటరీ క్లబ్ మెంబర్ గాలి గంగాధర్‌రావు ఆర్థిక సహకారంతో సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. క్లబ్ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, కార్యదర్శి చెరుకూరి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి

● పుట్టల వద్ద పాలుపోసి విశేష పూజలు ● శింగరకొండ రామాలయం పుట్ట వద్ద భక్తుల సందడి


కడవకుదురు పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు

చినగంజాం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మహిళా భక్తులు నాగుల చవితి పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో శనివారం ఘనంగా నిర్వహించారు. నాగేంద్రస్వామి ఆలయాలల్లో, పుట్టల వద్ద మహిళా భక్తులు బారులు తీరారు. భక్తులు పసుపు, కుంకుమతో నాగశిలలను ఆలకరించి ప్రదక్షిణలు చేశారు. స్వామి వారి పుట్టల వద్ద సలిమిడి, పానకం, సజ్జలు, వడపప్పు, నాగేంద్రస్వామికి ప్రీతి పాత్రమైన ఆవుపాలను పోశారు, దారాలను చుట్టి పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు. కొత్తపాలెం గ్రామంలోని బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద, కడవకుదురు బస్టాండ్, నాగులచెరువుల సమీపంలో, చినగంజాం, పలు గ్రామాల్లోని పుట్టల వద్ద, ఆలయాలలో వల్లీదేవసేవ సుబ్రమణ్యేశ్వర స్వామికి అష్టోత్తర శతనామ కుంకుమార్చనలు, అభిషేకాలను నిర్వహించారు. నాగరాజ పాహిమాన్, 'నాగదేవత రక్షమాన్' అంటూ భక్తులు చేసిన స్వామి నామస్మరణలతో పుట్టల వద్ద మారుమ్రోగింది. పుట్టల వద్ద భక్తులకు అసౌకర్యం క లుగకుండా కమిటి సభ్యులు తగు ఏర్పాట్లు చేశారు. సంతరావూరు. చింతగుంపల్లి, గొనసపూడి, నీలాయపాలెం, రాజుబంగారుపాలెం తదితర గ్రామాల్లోని స్వామి వారి పుట్టల వద్ద మహిళా భక్తులు పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు.



భీమవరం పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు, అద్దంకిలో పూజలు చేస్తున్న మహిళలు

ఇంకొల్లు : మండలంలో శనివారం నాగులచవితి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని కడవకుదురు రోడ్డులోని భీమవరం పుట్ట వద్ద భక్తులు పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అత్యధిక సంఖ్యలో మహిళలు తరలి వచ్చి పుట్టవద్ద నాగేంద్ర స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

అద్దంకి : నాగులచవతిని మహిళా భక్తులు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని రామ్‌నగర్ పుట్టవద్ద, పోలేరమ్మ దేవాలయంలోని పుట్ట వద్ద, శింగరకొండలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలోని పుట్ట, కాకతీయ కమ్మ అన్నదాన సత్రం వద్ద ఉన్న పుట్టల వద్ద భక్తు లు పెద్ద సంఖ్యలో పూజలు చేసి పాలు పోశారు. శనివారం కావడంతో భక్తులు శింగర కొండలోని ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీ నరశింహస్వామి వార్లను దర్శించుకొని రామాలయం ఆవరణలోని సుబ్రహ్మణేశ్వరస్వామి దేవాలయంలో పుట్టలో పాలు పోసి పూజలు నిర్వహించారు. అన్ని గ్రామాలలో మహిళలు పుట్టల వద్ద పూజలు నిర్వహించి పాలు పోశారు.

దాతల సహకారంతో శింగరకొండ అభివృద్ధికి కృషి

ధర్మకర్తల మండలి చైర్మన్ మురళీ సుధాకరరావు


మట్లాడుతున్న ఆలయ చైర్మన్ మురళీ సుధాకరరావు

అద్దంకి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతో శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయానికి నాలుగు వైపులా రాజగోపురాలు, ప్రాకార మండపాల పునః నిర్మాణం చేపట్టనున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు తెలిపారు. శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం ధర్మకర్తల మండలి సభ్యులు శనివారం చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు అధ్యక్షతన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాల పై చర్చించారు. ప్రస్తుతం ఉన్న సేవా టిక్కెట్ ల ధరలు తగ్గించాలని, గోశాల నిర్మాణం చేయాలని, భక్తుల సౌకర్యార్థం టాయిలెట్స్ నిర్మాణం త్వరితగతిన చేపట్టా లని తీర్మానించనున్నారు. ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ మదమంచి తిమ్మానాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు నూతి ప్రసాద్,వెంకటరత్నం, సురేష్, పద్మజ, సుబ్బారావు, కోటేశ్వరరావు, నాగమ్మ, సునీత, వెంకటనారాయణమ్మ, చంద్ర శేఖర్, కోట లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

త్రివిక్రమ అగస్తేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

స్వామివార్లను దర్శించుకున్న ఏలూరి


ఆలయ ప్రదక్షణ చేస్తున్న ఏలూరి

చెరుకూరు (పర్చూరు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ త్రివిక్రమ అగస్తేశ్వర స్వామివార్ల ఆలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివార్లను పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు దర్శించుకొని పూజలు చేపట్టారు. ఆలయానికి చేరుకున్న ఏలూరికి ఆలయ అధికారి దామా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎంతో ప్రతిష్టతను సంతరించుకున్న ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పెద్దపూడి విజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, నాయుడు హనుమంతురావు, గ్యాస్ శ్రీనివాసరావు, కొల్లా శ్రీనివాసరావు, దాసరి ఉషారాణి, షంషుద్దీన్, షేక్.జమాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరపాలేనికి బల్లకట్టు ప్రారంభం

పర్చూరు : మండల పరిధిలోని చెరుకూరు శివారులోని ఉప్పరపాలెం గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శనివారం గ్రామం లోని కృష్ణాడెల్టా (కొమ్మమూరు) కాలువపై గ్రామస్థులు, రైతుల సౌకర్యార్థం రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన బల్లకట్టును ఏలూరి స్థానిక రైతులు, అధికారులతో కలసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అభివృద్ధికి నోచుకోని ఉప్పరపాలెం గ్రామాన్ని పూర్తి వినతులు కల్పించి మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. గ్రామానికి చేరుకున్న ఏలూరికి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. బల్లకట్టు మీద రైతులతో కలసి కొమ్మమూరు కాలువపై ప్రయాణించారు. కార్యక్రమంలో పొదవీరయ్య, షంషుద్దీన్, మక్కెన శేఖర్‌బాబు, నాయుడు హనుమంతురావు, దాసరి రామకృష్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న, ఆయాశాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ముంచుకొస్తోన్న.. మొంథా

(5వ పేజీ తరువాయి)

చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ముందస్తు చర్యల పై ఆదేశాలు జారీ చేశారు. ఏర్పాట్లపై కలెక్టర్లు సమీక్షిస్తున్నారు.

దిగుబడుల వేళ ముంపు

ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభంలో వర్షాలు ముఖం చాటేశాయి. మేలో ఎక్కువగా వర్షాలు కురిశాయి. ఆ తర్వాత సుమారు రెండు నెలల పాటు ముఖం చాటేశాయి. ఆగస్టు నుంచి మళ్లీ వర్షాలు కురుస్తున్నాయి. ఒకే రోజున 220 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైన సందర్భాలు కూడా ఉన్నాయి. గత ఏడాది కూడా ఇలానే ఆగస్టు, సెప్టెంబరులో భారీ వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ సంవత్సరం కొంచెం ఆలస్యంగా ఖరీఫ్ సీజన్ లో పంటల సాగుని రైతులు చేపట్టారు. దీంతో వరి, పత్తి తదితర పంటలు ఇంకా కోతలు చాలా చోట్ల మొదలుకాలేదు. నవంబరు మొదటి వారం తర్వాత కోతలు ఊపందుకుంటాయని అధికారులు భావిస్తూ అందుకు అనుగుణంగా ధాన్యం సేకరణ, పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. బాపట్ల జిల్లాలో 2,30,000 ఎకరాల్లో వరి సాగవగా 50 శాతం కోతలకు సిద్ధంగా ఉంది. గుంటూరు జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా పంటలు కోత దశలో ఉన్నాయి. పల్నాడు జిల్లాలో అత్యధికంగా పత్తి సాగవగా కోత దశకు చేరింది. కంది పంట కూడా వర్షాలకు ఉరకెత్తుతోంది. పత్తి, కంది, వరి పంటలకు వర్షాలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. చేలల్లో పెద్దఎత్తున వర్షపు నీరు చేరి పూత, పిందె తడిసిపోయాయి. రెండు నెలల వయస్సులో ఉన్న మిర్చి మొక్కలు నీటిలో కుళ్లిపోతున్నాయి. ఎక్కువ రోజులు మొక్క నీటిలో ఉండటంతో తెగుళ్లు సోకుతున్నాయి. శుక్రవారం సాయంత్రానికి వర్షాలు తగ్గుముఖం పట్టగా శనివారం కొన్ని ప్రాంతాల్లో ఎండ వచ్చింది. దీంతో రైతాంగం కొంతమేర ఊపిరి పీల్చుకుంది. ఎలాగోలా సస్యరక్షణ చర్యలు చేపట్టి కోతలు మొదలు పెడదామనుకుంటున్న తరుణంలో మొంథా తుపాను హెచ్చరికలతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. అధికవర్షపాతం నమోదైతే డ్రెయిన్లు, పంట కాల్వల్లో నుంచి నీరు పొంగి పొలాల్లో ప్రవహించి రోజుల తరబడి నిలబడిపోయే ప్రమాదం ఉన్నది. ఇప్పటికే పెట్టుబడులు ఖర్చులు కూడా రాని విధంగా పలు దఫాలుగా వర్షాలు తమను కుదేలు చేశాయని, రాబోయే నాలుగు రోజులు భారీ వర్షాలు నమోదైతే పంటలు ఏమీ మిగలవనే ఆవేదనను రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

పైపాటుపై రైతులు దృష్టి సారించాలి

తోటవారిపాలెం(చీరాల), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పంట పొలాల్లో అకాల వర్షాలతో నీళ్ల చేరడంతో రైతులు నత్రజని, పొటాష్ కలిపిన ఎరువులను పైపాటుగా పిచికారి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం చీరాల మండల పరిధిలోని తోటవారిపాలెంలోని పొలాలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఈ నెలాఖరులోగా రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. వారి వెంట స్థానిక సహాయక సంచాలకులు రత్నకుమారి, ఏవో నిర్మళాదేవీ, వీఏఏ నీలిమ, రైతులు ఉన్నారు.

పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తాం : ప్రత్యేకాధికారి

పంగులూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల కారణంగా పంటనష్టపోయిన రైతులకు తగిన న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని నియోజకవర్గ ప్రత్యేకాధికారి బాలమ్మ అన్నారు. గత కొద్దిరోజులుగా ఎడతెరపు లేకుండా కురిసిన వర్షాల కారణంగా కొండమూరు, రేణంగివరం గ్రామాలలో దెబ్బతిన్న మినుము పైరును స్థానిక అధికారులతో కలసి ఆమె శనివారం పరిశీలించారు కోతదశకు చేరుకున్న మినుము అధికవర్షంతో పూర్తిగా దెబ్బతిన్న పరిస్థితిని రైతులు అధికారులకు వివరించారు. రైతులు ఆందోళన చెందవద్దని, పంట పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించి తగిన సాయం అందేలాచర్యలు చేపడతామన్నారు. ఏవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ మండలంలో కొండమూరు, రేణంగివరం, ముప్పవరం, బూదవాడ,అలవలపాడు, బైటమంజులూరు, కె.వి.పాలెం, కొండమంజులూరు, తక్కెళ్లపాడు పరిసర గ్రామాలలో రెండున్నరవేల ఎకరాలలో అదికవర్షం కారణంగా మినుము పంటకు నష్టం వాటిల్లిందని తెలిపారు.

నీటి సంఘాలకూ జీఎస్టీ బాదుడు!

(5వ పేజీ తరువాయి)

సదరు నీటి సంఘాల సభ్యులు వాపోతున్నారు. తాము కాంట్రాక్టర్లం కాదని, జీఎస్టీని రద్దు చేయాలని.. బిల్లుల నుంచి మినహాయించరాదని వారు కోరుతున్నారు. మినహాయించిన జీఎస్టీని ఇన్‌పుట్ బిల్లులు దాఖలు చేస్తే తిరిగి చెల్లించే అవకాశం ఉంటుందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే కాలువల మరమ్మతులకు ఇన్‌పుట్ బిల్లులు ఎలా ఉంటాయని నీటి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. మొత్తం మీద జీఎస్టీ కోత నీటి సంఘాలకు మింగుడుపడనిదిగా ఉంది. ప్రభుత్వం జీఎస్టీ విషయంలో పునరాలోచన చేయాలని నీటి సంఘాలు కోరుతున్నాయి.

యూరియా బస్తా రూ.450

(5వ పేజీ తరువాయి)

విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోయి పత్తి, మిరప, కంది పంటలు ఉరకెత్తి ఎండిపోతున్నాయి. అయా పంటలను కాపాడుకునేందుకు పొలంలో నిలిచిన నీరు బయటకు పంపి.. యూరియా పంటకు వినియోగించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు యూరియా కొనుగోలు చేస్తున్నారు. రైతుసేవా కేంద్రాలకు యూరియా సరఫరాను వారం రోజులుగా నిలిపివేశారు. అక్కడక్కడా కొన్ని సొసైటీల్లో మాత్రమే యూరియా నిల్వలు ఉన్నాయి. అధిక వర్షాల వల్ల యూరియాకు డిమాండ్ ఏర్పడడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. కొందరు వ్యాపారులు అధిక ధరకు యూరియాను విక్రయిస్తున్నారు. ప్రభుత్వం యూరియా బస్తా ధర రూ.266.65గా నిర్ణయించింది. అయితే కొన్ని మండలాల్లో బస్తా రూ.420 నుంచి రూ 450 వరకు విక్రయిస్తున్నారు. అధిక ధరలను నియంత్రించడంలో వ్యవసాయ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నెలాఖరు వరకు కష్టం..

కొన్ని సొసైటీలకు సరఫరా చేసే ఎరువులు రాజకీయ అండదండలు ఉన్న రైతులకే అందుతున్నాయన్న విమర్శలున్నాయి. సొసైటీల కంటే ఆర్‌ఎస్‌కేల ద్వారా ఎరువులు విక్రయిస్తే అందరికి న్యాయం జరగుతుందని రైతులు చెబుతున్నారు. ఈ నెలాఖరు వరకు రైతులు సేవా కేంద్రాలకు యూరియా సరఫరా చేసే అవకాశం లేదని తెలుస్తోంది. ఈ-క్రాప్ బుకింగ్ ఈ నెలాఖరుకు పూర్తి చేయాలి. దీంతో ఆర్‌ఎస్‌కేలకు ఎరువులను సరఫరా చేస్తే పంట నమోదు పూర్తి కాదన్న వాదనను వ్యవసాయ శాఖ అధికారులు వినిపిస్తున్నారు. అప్పటి వరకు రైతులు ప్రైవేట్ వ్యాపారుల పైనే ఎరువుల కోసం ఆదారపడాల్సి ఉంది. దీనిపై వ్యవసాయ శాఖ జేడీని వివరణ కోరగా అధిక ధరకు యూరియా విక్రయిస్తే వ్యాపారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కేసులు నమోదు చేయడం చేశామన్నారు.. ఇప్పటికే అధిక రేట్లకు ఎరువులు విక్రయించిన ఆరు షాపులపై కేసులు నమోదు చేశామన్నారు. ఎక్కడైనా అధిక రేటుకు ఎరువులు విక్రయిస్తే సమీప వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు.

నేడు సృజన సాహిత్య సమావేశం

అద్దంకిటౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక కమఠేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు సృజన సాహిత్య సమావేశం నిర్వహించనున్నట్లు సృజన బాధ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో 'మున్షి ప్రేమ్ చంద్ జీవితం- వ్యక్తిత్వము- సాహిత్యం' గురించి ధర్మవరపు శ్రావణ్‌కుమార్, కుందుర్తి పద్మజ రచించిన పంకజం పదనిసలు (హాస్యపు కథల సంపుటి) పరిచయ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సాహితీ మిత్రులు అందరు హాజరుకావాలన్నారు.

ఆర్‌డీఎస్ పనులతో నాణ్యమైన విద్యుత్

బల్లికురవ, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో జరుగుతున్న ఆర్డీఎస్ ప్రత్యేక విద్యుత్ లైన్లతో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందుతోందని అద్దంకి డివిజన్ విద్యుత్‌శాఖ ఈఈ మస్తానరావు తెలిపారు. శనివారం మండలంలోని కూకట్లపల్లి గ్రామంలో ప్రత్యేక లైన్ల పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో శిధిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను తొలగించడంతోపాటు, ఆధునాతనమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలకు త్రీఫేస్ విద్యుత్ 24 గంటలు విద్యుత్ అందుబాటులో ఉండేలా ఈ లైన్ ఏర్పాటుచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విప్పల అంజిరెడ్డి, పందిరి అబ్రహం, కల్లూరి రమేష్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

చిమ్మిరిబండ వీఆర్‌వో మృతి

మార్టూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిమ్మిరిబండ వీఆర్‌వో పి.శామ్యూల్ (57) శుక్రవారం రాత్రి మృతిచెందాడు. ఆయన మార్టూరు గ్రామంలో సుందరం పొగాకు కంపెనీ సమీపంలోని ఒక ఇంటిలో నెల రోజుల నుంచి అద్దెకు ఉంటున్నారు. శుక్రవారం రాత్రి ఇంటిలో నేలపై పడుకొని ఉన్న ఆయన్ను ఇంటి యజమాని పరిశీలించగా, అప్పటికే మృతిచెందాడు. ఈ విషయాన్ని వలపర్లలోని ఆయన బంధువులకు తెలిపారు. శామ్యూల్‌కు విపరీతంగా మద్యం సేవించే అలవాటు ఉన్నట్లు తెలిసింది. ఈ ఏడాది జనవరిలో నిజాంపట్నం మండలం నుంచి డిప్యూటేషన్‌పై మార్టూరు మండలానికి వచ్చారు. శనివారం ఉదయం తహసీల్దార్ టి.ప్రశాంతి, ఆర్ఐ అశోక్, పలువురు వీఆర్‌వోలు మృతునికి నివాళులు అర్పించారు. మృతుడు పల్నాడు జిల్లా ఈపూరు మండలం ఆరెపల్లి ముప్పాళ్ల గ్రామానికి చెందిన వారు. మృతుని కుమారుడు కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం.శ్రీనివాసులు తెలిపారు.

మొంథా తుఫాన్‌తో అప్రమత్తంగా ఉండండి

● ఆర్‌డీవో చంద్రశేఖర్‌నాయుడు సూచన

● కార్తీక మాసం స్నానాలు నిలిపివేత

● మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచన


ఆర్‌డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ గండం పొంచి ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు సూచించారు. శనివారం ఆయన కార్యాలయంలో అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులతో తుఫాన్‌కు సంబంధించిన రక్షణ చర్యలపై సమావేశం నిర్వహించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ భారీ వర్షాలు కారణంగా ఈ నెల 29 వరకు సముద్ర స్నానాలకు అనుమతి లేదన్నారు. అలాగే మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు. డివిజన్ పరిధిలోని అన్ని పాఠశాలలకు వచ్చే బుధవారం వరకు సెలవులు ప్రకటించినట్లు చెప్పారు. అత్యవసరాలకు మినహా నివాసాల్లోని నుండి ప్రజలు బయకు రాకూడదని సూచించారు. వృద్ధులు, వివిధ అనారోగ్య సమస్యలున్న వారు మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విపత్కర సమయాల్లో 8712655910కు సమాచారం అందించాలని చెప్పారు.

కార్తీక స్నానాలు నిషేధం


చినగంజాం : మొంథా తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో మండల పరిధిలోని మోటుపల్లి, బాపయ్యనగర్, పల్లెపాలెం సముద్ర తీరప్రాంతాల్లో కార్తీక మాస స్నానాలు నిషేధించినట్లు ఎస్ఐ శీలం రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు కార్తీకమాస సముద్రస్నానాలను వాయిదా వేసుకొని తిరిగి వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడు మాత్రమే రావాలని సూచించారు.

వరదల సమయంలో వాగులను దాటవద్దు

అద్దంకి : తుఫాన్ ప్రభావంతో నాలుగైదు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా వరద నీరు వచ్చే సమయంలో వాగులను దాటవద్దని సీఐ సుబ్బరాజు తెలిపారు. వర్షాలు పడే సమయంలో ఇళ్ల నుండి బయటకు రావద్దని, తప్పని సరి పరిస్థితులలో ప్రయాణించాల్సి వస్తే వాగులు దాటే సమయంలో జా గ్రత్తగా ఉండాలన్నారు. మండలంలో వాగులు వద్ద పలు వాగులను ఆయన పరిశీలించారు.

గొయ్యికి తాత్కాలిక మరమ్మతులు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన


భవానిసెంటర్‌లో గ్రావెల్‌తో పూడుస్తున్న గొయ్యి

అద్దంకి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్ లో నామ్ రోడ్డు నుండి రేణింగవరం రోడ్డు కు వెళ్లే ప్రాంతం లో పెద్ద గొయ్యి ఏర్పడి రాకపోకలకు ఇబ్బంది గా మారడంతో 'ఆంధ్రజ్యోతి'లో శనివారం రహదారి లో 'గోతులతో వాహనచోదకుల ఇక్కట్లు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన మున్సిపల్ కాంట్రాక్టర్ నాదెండ్ల సుబ్బారావు తన సొంత నిధులతో గ్రావెల్ తెప్పించి గోతులు పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అదే ప్రాంతంలో తరచూ గోతులు ఏర్పడుతూ రాకపోకలకు ఇబ్బంది గా మారుతున్న నేపథ్యంలో అధికారులు స్పందించి శాశ్వతంగా మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.